


Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్




అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 06 | శుక్రవారం 14 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు

- మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు
- ప్రధాని నరేంద్ర మోదీ తీరుపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు
- వేదికపైనే కాంగ్రెస్ నేతను కౌగిలించుకుని సెటైర్
- చైనా, ఇరాన్ విషయంలో భారత వైఖరిని తప్పుపట్టిన రాహుల్
- బీజేపీ, ఆరెస్సెస్‌ను జోకర్ల బృందంగా అభివర్ణన



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాల అధినేతలను ఆలింగనం చేసుకోవడం, వ్యక్తిగత స్నేహాలను

- మిగతా 2లో..

## పార్లమెంటులో 12 బిల్లులు ఆమోదం

- లోక్‌సభలో ఎటువంటి చర్చా లేకుండా 11 బిల్లులు
- లోక్‌సభ 19 శాతం, రాజ్యసభ 39 శాతం ఉత్పాదకత
- ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- మోడీ, షా వైఖరితో స్తంభించిన ఉభయ సభలు



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

జులై 20న ప్రారంభమైన వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్ 12 బిల్లులను ఆమోదించింది. వీటిలో ఒక బిల్లుపై మాత్రమే ఉభయ సభలలో కూలంకషంగా చర్చ జరిగింది. నీట్ లీక్ తరువాత విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు ప్రవేశపెట్టిన 'పబ్లిక్ పరీక్షల అవకతవకల నివారణ (సవరణ) బిల్లు'పై లోక్‌సభలో 10 గంటల 54 నిమిషాలు, రాజ్యసభలో 6 గంటల 39 నిమిషాలు చర్చ జరిగింది. లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ చర్చకు వచ్చిన ఏకైక బిల్లు ఇదే. ఈ బిల్లు మినహా, మరే ఇతర బిల్లుపైనా ఏ సభలోనూ

- మిగతా 2లో..



## 80వ స్వాతంత్ర్య వేడుకలు.. ముస్తాబైన ఎర్రకోట

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశ రాజధానిలోని 80వ స్వాతంత్ర్య వేడుకలకు ఎర్రకోట సిద్ధమైంది. ఆగస్టు 15న ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఎగురవేయనున్నారు. ఈ ఏడాది 'వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు, వికసిత్ భారత్‌ఏ2047 కోసం యువశక్తి' థీమ్‌లతో

- మిగతా 2లో..



## నాపైనే కుల వివక్ష

- ప్రజాస్వామ్యంలో ఇదేం పద్ధతి..
- రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే ఆవేదన
- ఉత్తరాఖండ్‌లో ఖర్గే ప్రసంగించిన ప్రదేశంలో శుద్ధీకరణ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

బీజేపీ పాలనలో దళితులకు సరైన గౌరవం దక్కదని మరోసారి రుజువైంది. ఈ అనుభవం సాక్షాత్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఎదురైంది. రాజ్యసభ ప్రతిపక్ష నేత కూడా అయిన ఖర్గేకు ఉత్తరా ఖండ్‌లో తీవ్ర అవమానం జరిగింది. ఈనెల 8న ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ లో ఖర్గే ఒక బహిరంగసభలో ప్రసంగించిన తర్వాత ఆ ప్రదేశం అపవిత్రమై

- మిగతా 2లో..



## ఓటు తొలగింపుపై అధికారుల వివరణ అబద్ధం

- కొత్త వీడియోతో ముందుకొచ్చిన ప్రకాశ్ రాజ్
- బెంగళూరు ఓటర్ల జాబితాలో తన పేరు తొలగించారని ప్రకాశ్ రాజ్ ఆరోపణ
- తొలగించలేదు, చిరునామా మారారని మాత్రమే గుర్తించామన్న ఎన్నికల అధికారులు
- అధికారుల వివరణపై అసంతృప్తి.. అదంతా నాటకమని కొత్త వీడియో విడుదల
- సామాన్య పౌరుడి హక్కుల కోసమే ఈ పోరాటమంటున్న నటుడు
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో రాజుకున్న వివాదం

9లో

# చదువుకు చుక్కెదురు

- ప్రభుత్వ విద్యను కుదేలు చేసిన మోడీ సర్కారు
- హయ్యర్ సెకండరీలో చేరకముందే 73 శాతం మంది విద్యార్థులు డ్రాపౌట్
- పాఠశాలలు లేక చదువుకు దూరమవుతున్న లక్షల మంది పిల్లలు
- వికలాంగులకు కనీస సౌకర్యాలూ కరువు..కేటాయింపులు ఖర్చు చేయడంలోనూ ఘోర వైఫల్యం
- పార్లమెంటరీ కమిటీ నివేదికతో కేంద్ర ప్రభుత్వ విద్యా విధానంపై తీవ్ర ప్రశ్నలు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశానికి విశ్వగురు అనే నినాదాలు వినిపిస్తున్నా, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న లక్షలాది మంది పిల్లలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోంది. ప్రాథమిక స్థాయిని దాటే కొద్దీ పాఠశాలల సంఖ్య తగ్గిపోవడం, 73 శాతం మంది విద్యార్థులు హయ్యర్ సెకండరీ పూర్తి చేయముందే చదువు మానేయడం, వికలాంగ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం వంటి అంశాలు కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాల అమలుపై తీవ్రమైన సందేహాలను రేకెత్తిస్తున్నాయని పార్లమెంటరీ కమిటీ స్పష్టం చేసింది.




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశంలో ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల పరిస్థితిపై పార్లమెంటరీ అంచనా కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విద్యా స్థాయి పెరిగే కొద్దీ పాఠశాలల సంఖ్య, విద్యార్థుల నమోదు గణనీయంగా తగ్గిపోతోంది. ఫలితంగా దాదాపు 73 శాతం మంది విద్యార్థులు హయ్యర్ సెకండరీ పూర్తి చేయకముందే చదువు మానేస్తున్నారని కమిటీ తన పదో నివేదికలో వెల్లడించింది. బడ్జెట్ కేటాయింపులు, నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) గురించి మోడీ సర్కారు గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ...

- మిగతా 2లో..



## ఇవాళ జైలులో నన్ను కూడా అవమానించారు

- కర్నూలు జైలులో ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన జగన్
- చంద్రబాబు రెడ్ బుక్ పాలనతో ప్రతిపక్షాన్ని అణిచివేస్తున్నారని ఆరోపణ
- బాధితులే నిందితులుగా మారుతున్నారని, విరూపాక్షి ఘటనే ఉదాహరణ అన్న జగన్
- బీసీ, మైనారిటీ నేతలను లక్ష్యంగా చేసుకుని కేసులు పెడుతున్నారని విమర్శ
- తాను నాటిన తప్పుడు విత్తనాలే రేపు చంద్రబాబును చుట్టుకుంటాయని హెచ్చరిక

9లో



## ఖర్గేకు అవమానం..

- రాష్ట్రవ్యాప్త నిరసనలకు షర్మిల పిలుపు
- ఖర్గే పర్యటించిన స్థలాన్ని శుద్ధి చేయడంపై షర్మిల తీవ్ర ఆగ్రహం
- ఇది దళితుల వ్యక్తిత్వానికి జరిగిన అవమానమంటూ విమర్శ
- బీజేపీ కుల వివక్షకు, విభజన రాజకీయాలకు నిదర్శనమని ఆరోపణ
- ఆగస్టు 14న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, సత్యాగ్రహానికి పిలుపు

9లో

## ఏపీ ఇంధన రంగంలో కీలక మార్పులకు శ్రీకారం..



- 130 జలాశయాల్లో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై చంద్రబాబు ఫోకస్
- రాష్ట్రంలోని 130 జలాశయాల్లో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుపై అధ్యయనం
- సెప్టెంబర్ నాటికి 6 లక్షల 'పీఎం సూర్య ఘర్' సోలార్ కనెక్షన్ల ఏర్పాటుకు ఆదేశం
- విద్యుత్ కొనుగోలు సగటు ఖర్చును యూనిట్‌కు రూ.4కు తగ్గించాలని లక్ష్యం
- రాష్ట్రంలో విద్యుత్ సంస్థలకు పనితీరు ఆధారిత రేటింగ్ విధానం ప్రవేశపెట్టాలని సూచన
- రానున్న ఆరేళ్లలో విద్యుత్ వినియోగం రెట్టింపు అవుతుందని అంచనా

అమరావతి - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌ను ఇంధన రంగంలో అగ్రగామిగా నిలబెట్టే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని 130 జలాశయాల్లో పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలు, సాధ్యసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఇంధన శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టు వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటు ప్రతిపాదనపై చర్చిస్తూ, రాష్ట్రంలోని ఇతర జలాశయాల వద్ద కూడా ఇలాంటి ప్రాజెక్టుల ఆర్థిక సాధ్యతపై నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా జలాశయాల నుంచి విద్యుదుత్పత్తికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ ఉత్పత్తి కొనసాగేలా ముందుగానే

- మిగతా 2లో..

## రాష్ట్రంలోనూ బీజేపీ కుట్ర

- సర్ పేర లక్షలాది ఓట్ల తొలగింపునకు యత్నం
- గుజరాత్ నుంచి వచ్చే వారికి చోటే లేదని చెప్పాలి
- విద్యావంతులు 10 రోజులు ఓటర్లకు
- సహకరించాలి : సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

హైదరాబాద్ - సూర్య వాస్తవం

ఓట్ల తొలగింపుతో పశ్చిమబెంగాల్ లో అధికారంలోకి వచ్చిన తరహాలోనే తెలంగాణలోనూ పాగా వేసేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. బెంగాల్‌ను దీదీ వదులుకున్నారేమో గానీ, తెలంగాణను వదులుకునేందుకు ఇక్కడ ఎవరూ సిద్ధంగా లేరని ఆయన హెచ్చరించారు. ఈడీ, సీబీఐ, ఈసీ తదితర

- మిగతా 9లో..



సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## 80వ స్వాతంత్ర్య వేడుకలు..
# ముస్తాబైన ఎర్రకోట

(మొదటి పేజీ తరువాయి)

వేడుకలు జరపనున్నారు. జ్ఞానపథ్‌లో వందేమాతరం ఆకృతిలో 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 'మై భారత్' వాలంటీర్లు కూర్చోనున్నారు. వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు వివిధ రంగాలకు చెందిన దాదాపు 5 వేల మందికి అధికారులు ప్రత్యేక ఆహ్వానం పంపారు. మరోవైపు, పర్యాటకుల సౌకర్యార్థం ఉచిత మెట్రో ప్రయాణం, క్యూఆర్ కోడ్ ఈ–ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. వేడుకలు ముగిసిన వెంటనే ఎర్రకోట పరిసరాల్లో చెత్త తొలగింపు కోసం 'స్వచ్ఛత ప్రచారం' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

## విదేశాంగ విధానమంటే
# ఆలింగనాలు కాదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శించడం విదేశాంగ విధానం అనిపించుకోదని, దేశ ప్రయోజనాలను కాపాడటమే అసలైన దౌత్యమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన 'రచనాత్మక్ కాంగ్రెస్' జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశాంగ విధానమంటే విదేశీ నేతలను కౌగిలించుకోవడమన్న ఆలోచన మోదీకి ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తన వాదనను వివరించేందుకు వేదికపై ఉన్న రచనాత్మక్ కాంగ్రెస్ చీఫ్ సందీప్ దీక్షిత్‌ను ఆయన ఆలింగనం చేసుకున్నారు. తన నాయనమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి బాల్యంలో అమెరికా వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, దేశాధినేతల అధికారిక పర్యటనలు వ్యక్తిగత పర్యటనలు వంటివి కావని ఆయన పేర్కొన్నారు. ఇరాన్, అమెరికా, రష్యాలతో భారత్‌కు సుహృద్భావ సంబంధాలు ఉన్నప్పటికీ, ఇరాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించే అరుదైన అవకాశాన్ని భారత్ కోల్పోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం పెట్రోలింగ్‌ను చైనా అడ్డుకుంటోందని, గల్వాన్ ఘర్షణల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి దేశాన్ని బలహీనపరిచిందని ఆయన విమర్శించారు. బీజేపీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్)లను ఒక 'జోకర్ల బృందం'గా అభివర్ణించిన రాహుల్ గాంధీ, ఆ సంస్థలు దేశంపై ఏకపక్ష రాజకీయ వ్యవస్థను రుద్దేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతును ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు.

## ఓటు తొలగింపుపై
# అధికారుల వివరణ అబద్ధం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, కర్ణాటక ఎన్నికల అధికారుల మధ్య ఓటు హక్కు నమోదు విషయంలో మాటల యుద్ధం కొనసాగుతోంది. బెంగళూరు ఓటర్ల జాబితా నుంచి తన పేరును తొలగించారని ప్రకాశ్ రాజ్ ఆరోపించగా, అధికారులు దానిని ఖండించారు. తాజాగా, అధికారులు ఇచ్చిన వివరణపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం మరో వీడియోను విడుదల చేశారు. అధికారులది పచ్చి అబద్ధమని, నాటకమాడుతున్నారని ఆయన ఆరోపించారు. వివరాల్లోకి వెళితే.. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గ జాబితా నుంచి తన పేరును తొలగించారని ప్రకాశ్ రాజ్ ఇటీవల ఒక వీడియోలో ఆరోపించారు. తాను పుట్టి పెరిగిన, చదువుకున్న, 2019లో ఎంపీగా పోటీ చేసిన చోటే తన ఓటు గల్లంతు కావడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ప్రక్రియలో బెంగళూరులో సుమారు 65 లక్షల మంది ఓటర్లు ప్రభావితమయ్యారని కూడా ఆయన పేర్కొన్నారు. ప్రకాశ్ రాజ్ ఆరోపణలపై బెంగళూరు నగర పాలక సంస్థ, ఎన్నికల అధికారులు స్పందించారు. ఆయన పేరును తొలగించలేదని, కేవలం "నివాసం మారారు" (ఒష్ట్రఊట్‌వఎ) అని మాత్రమే జాబితాలో గుర్తించామని స్పష్టం చేశారు. ఆయన నమోదు చేసుకున్న విఠల్ మాల్యా రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో దాదాపు నాలుగేళ్లుగా నివసించడం లేదని బూత్ స్థాయి అధికారి (బీూ) విచారణలో తేలిందని తెలిపారు. చుట్టుపక్కల వారు, భవన యజమాని కూడా ఇదే విషయాన్ని ధృవీకరించారని, ఈ మేరకు తనిఖీ కూడా నిర్వహించామని వివరించారు. తాను వేరే చోట నివసిస్తున్నట్లు ప్రకాశ్ రాజ్ సైతం ఫోన్‌లో అంగీకరించారని అధికారులు తెలిపారు. ఫారం 6 ద్వారా కొత్త చిరునామాను నమోదు చేసుకోవాలని సూచించారు. అయితే, అధికారుల వివరణను ప్రకాశ్ రాజ్ పూర్తిగా తోసిపుచ్చారు. తొలుత పొరపాటు జరిగిందని అంగీకరించి, సరిచేస్తామని చెప్పిన అధికారులే.. ఇప్పుడు మాట మార్చి నాటకాలాడుతున్నారని మండిపడ్డారు. వివాదం పెద్దది కావడంతోనే "శాశ్వతంగా మారారు" (జూవతీఝఅవత్శ్రీఎ ఒష్ట్రఊట్‌వఎ) అనే పదాన్ని "మారారు" (ఒష్ట్రఊట్‌వఎ) అని మార్చి, ప్రెస్ మీట్ పెట్టి, తన పాత చిరునామాలో నకిలీ తనిఖీ చేశారని ఆరోపించారు. ఇది తన ఒక్కడి సమస్య కాదని, పౌరుల హక్కుల కోసం తన పోరాటం కొనసాగుతుందని, మరిన్ని వివరాలతో మళ్లీ వస్తానని ఆయన స్పష్టం చేశారు.

## ఏపీ ఇంధన రంగంలో
# కీలక మార్పులకు శ్రీకారం..

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామికీకరణ వేగవంతం అవుతున్నందున, ప్రతి ఆరేళ్లకు విద్యుత్ వినియోగం రెట్టింపు అయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. పెరుగుతున్న ఈ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని, తక్కువ ధరకే విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అదే సమయంలో విద్యుత్ పంపిణీ నష్టాలను మరింత తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సౌర విద్యుత్ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'పీఎం సూర్య ఘర్' పథకం కింద సెప్టెంబర్ నాటికి 6 లక్షల సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ పథకం కిందకు రాని మరో మూడు లక్షల కనెక్షన్లను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. దీంతోపాటు, మరో 10 లక్షల కనెక్షన్ల కోసం కేంద్రానికి దరఖాస్తు చేయాలని అధికారులకు సూచించారు. 'పీఎం–కుసుమ్' పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు, అదనంగా 2,000 మెగావాట్ల సామర్థ్యం కోసం కేంద్రాన్ని అభ్యర్థించాలని తెలిపారు.

తక్కువ ఖర్చుతో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసే వ్యవస్థను రూపొందించేందుకు సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ వనరులను అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని చంద్రబాబు నొక్కిచెప్పారు. ఈ ఏడాది సగటు విద్యుత్ కొనుగోలు ఖర్చును యూనిట్‌కు రూ. 4.60కి, 2029 నాటికి రూ. 4కి తగ్గించాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. రాష్ట్రంలోని ఆరు విద్యుత్ సంస్థల (యుటిలిటీల) పనితీరును మెరుగుపరిచేందుకు 'పనితీరు ఆధారిత రేటింగ్' విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. ప్రతి సంస్థకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి, అగ్రశ్రేణి కార్పొరేట్ సంస్థలతో పోటీపడేలా వాటిని తీర్చిదిద్దాలని అన్నారు. ఈ సందర్భంగా, విద్యుత్ కొనుగోళ్లలో ఆప్టిమైజేషన్ ద్వారా రూ. 234 కోట్లు ఆదా అయినట్లు, సకాలంలో చెల్లింపులు చేయడం వల్ల రిబేట్ల రూపంలో మరో రూ. 100 కోట్లు ఆదా అయినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

## పార్లమెంటులో
# 12 బిల్లులు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కూలంకషంగా చర్చ జరగలేదు. లోక్‌సభ 11 బిల్లులను చర్చ లేకుండానే ఆమోదించింది. ఈ బిల్లులలో తొమ్మిదింటిపై సంబంధిత మంత్రులు మాత్రమే మాట్లాడారు. ?కీలకమైన అంశాలపై వివరణలు ఇవ్వని కేంద్ర ప్రభుత్వ దుస్సాహసానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఉభయ సభలలో తీవ్రంగా నిరసన తెలుపుతుండగా... కేంద్ర ప్రభుత్వం మాత్రం చర్చ లేకుండానే ముఖ్యమైన బిల్లులను ఆమోదించడంలో నిమగ్నమైంది. 'మ్యాగీ నూడుల్స్ తయారు చేసినంత సులభంగా' కేంద్ర ప్రభుత్వం బిల్లులను ఆమోదిస్తుందన్న తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరిక్ ఓ'బ్రియన్ విమర్శను వర్షాకాల సమావేశాల గణాంకాలు కూడా ధృవీకరిస్తున్నాయి. 1969 జనన, మరణాల నమోదు చట్టాన్ని సవరించడానికి ఉద్దేశించిన ముఖ్యమైన బిల్లుపై లోక్‌సభలో ఎలాంటి చర్చా జరగలేదు. మరోవైపు, రాజ్యసభలో కేవలం 50 నిమిషాలు మాత్రమే చర్చ జరిగింది. ప్రతి ఎంపీకి కేటాయించిన సగటు సమయం మూడు నిమిషాలు మాత్రమే. విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు (ఎఫ్‌సీఆర్‌ఏ)ను అధ్యయనం, నివేదిక కోసం సంయుక్త సభా సంఘాని (జేపీసీ)కి నివేదించారు. వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ సామర్థ్యం 19 శాతంగా, రాజ్యసభ సామర్థ్యం 39 శాతంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అనవసరమైన ప్రతిపక్ష నిరసనలు ఉభయ సభల సామర్థ్యాన్ని దెబ్బతీశాయని కూడా మంత్రి ఆరోపించారు. అయితే, కీలకమైన అంశాలపై వివరణ ఇవ్వడానికి, చర్చలు జరపడానికి సిద్ధంగా లేని కేంద్ర ప్రభుత్వం, వర్షాకాల సమావేశాలను నిరసనల సముద్రంలో ముంచివేసిందని ప్రతిపక్షాలు ఎత్తి చూపాయి. ?ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత, 2016లో పెద్ద నోట్ల రద్దు అనంతరం జరిగిన నిరసనల కారణంగా వర్షాకాల సమావేశాలు పూర్తిగా రద్దయ్యాయి. లోక్‌సభ తనకు కేటాయించిన సమయంలో కేవలం 15 శాతం, రాజ్యసభ 18 శాతం మాత్రమే పనిచేశాయి. 2018 బడ్జెట్ సమావేశం, 2021 వర్షాకాల సమావేశం, 2023 బడ్జెట్ సమావేశాలు కూడా భారీ నిరసనలతో దెబ్బతిన్నాయి.

**మోడీ, షా గైర్హాజరుతో స్తంభించిన పార్లమెంట్**

ప్రతిపక్షాల ఐక్యతా రాగం.. తలకిందులైన కేంద్రం లెక్కలు

జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై దాడి ఘటన గురించి స్పందించాలని ప్రతిపక్షాలు ఎంతగా పట్టుబట్టినప్పటికీ... ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా లు లెక్కచేయలేదు. దీంతో ప్రతిపక్షాల నిరసనల నడుమే పార్లమెంట్ శీతాకాల సమావేశాలు పూర్తిగా స్తంభించిపోయాయి. జులై 20న ప్రారంభమై గురువారం ముగిసిన ఈ సమావేశాల్లో... జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై దాడి సహా మరే అంశంపైనా చర్చ జరగలేదు. పార్లమెంట్‌ను సజావుగా నిర్వహించాలన్న ప్రభుత్వ ఆసక్తి ఈ సమావేశాల్లో ఎంత మాత్రమూ కనిపించలేదు. సహజంగానే ఉభయ సభలలోని ప్రతిపక్ష పార్టీలు జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన దాడి విషయాన్ని లేవనెత్తాయి. అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలన్న సహేతుకమైన డిమాండ్‌ను మాత్రమే ప్రతిపక్ష పార్టీలు ముందుకు తెచ్చాయి. కానీ మోడీ, షా ప్రతిపక్షాల డిమాండ్‌కు తలొగ్గడానికి ఇష్టపడలేదు. జంతర్ మంతర్ వద్ద అణచివేతకు వ్యతిరేకంగా ప్రజాగ్రహం బలపడటంతో, మోడీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆ పదవి నుంచి తప్పించాల్సి వచ్చింది. ఆర్‌ఎస్‌ఎస్‌కు కూడా విధేయుడైన ప్రధాన్ రాజీనామా, సంఘ్ పరివార్‌లో మోడీ–షా కూటమిపై విమర్శలకు దారితీసింది.

# చదువుకు చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉందని ఈ నివేదిక పరోక్షంగా తేటతెల్లం చేసింది. ?2024–25 యూడైస్ గణాంకాల ప్రకారం... దేశంలో మొత్తం 10,92,671 ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 9,11,032 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అయితే సెకండరీ స్థాయికి వచ్చేసరికి ఈ సంఖ్య 1,61,808కు, హయ్యర్ సెకండరీ స్థాయిలో కేవలం 90,866కు మాత్రమే పరిమితమవుతోంది. అంటే పిల్లలు పై తరగతులకు వెళ్లే కొద్దీ పాఠశాలలు అందుబాటులో లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఇటు విద్యార్థుల సంఖ్య కూడా ఇదే పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. ప్రాథమిక తరగతుల్లో 6.18 కోట్ల మంది చదువుతుండగా... అప్పర్ ప్రైమరీలో అది 4.08 కోట్లకు పడిపోయింది. సెకండరీలో 2.36 కోట్లకు, హయ్యర్ సెకండరీలో 1.64 కోట్లకు మాత్రమే చేరింది. ఈ గణాంకాల ఆధారంగా దాదాపు 73 శాతం మంది విద్యార్థులు హయ్యర్ సెకండరీ పూర్తి చేయకముందే చదువు నుంచి తప్పుకుంటున్నారని కమిటీ పేర్కొంది.

**హక్కుల చట్టం, ఎన్ఈపీ అమలు ఎక్కడ**

వికలాంగుల హక్కుల చట్టం--2016 ప్రకారం 18 ఏండ్ల వయస్సు వరకు ఉచిత విద్య హక్కు కల్పించాల్సి ఉండగా, జాతీయ విద్యా విధానం--2020 (ఎన్ఈపీ) "జీరో రిజెక్షన్ పాలసీ"ని అమలు చేయాలని చెప్తున్నా... ఆ లక్ష్యాలు కాగితాలకే పరిమితమయ్యాయని కమిటీ వ్యాఖ్యానించింది. బడ్జెట్‌ను పూర్తిగా వినియోగించడం, ప్రత్యేక ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేయడం, ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకాన్ని వేగవంతం చేయాలని కేంద్ర విద్యాశాఖకు కమిటీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**విద్యపై అనేక నినాదాలు... క్షేత్రస్థాయిలో కఠిన వాస్తవాలు**

'విశ్వగురు', 'అమృత కాలం', 'నూతన విద్యా విధానం' వంటి భారీ నినాదాలతో కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నప్పటికీ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, గ్రామీణ, అణగారిన విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తేవడంలో ఆశించిన పురోగతి కనిపించడం లేదని ఈ పార్లమెంటరీ కమిటీ నివేదిక సూచిస్తోంది. పాఠశాలల కొరత, భారీ డ్రాపౌట్‌లు, వికలాంగ విద్యార్థులకు కనీస సౌకర్యాల లేమి, కేటాయించిన నిధులను కూడా సక్రమంగా వినియోగించలేకపోవడం వంటి అంశాలు కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని విద్యావేత్తలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నత పాఠశాలలు పెంచాలి**

ఈ పరిస్థితిని మార్చాలంటే ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాలలను దశలవారీగా పూర్తి స్థాయి హయ్యర్ సెకండరీ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని కమిటీ కేంద్ర విద్యాశాఖకు సూచించింది. ప్రతి ప్రాంతానికీ అందుబాటులో హైస్కూల్ ?ఉండేలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)లతో సమన్వయం చేసుకోవాలని కూడా పేర్కొంది.

**వికలాంగ విద్యార్థులకు కనీస వసతులూ లేవు**

వికలాంగ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల విషయంలో కేంద్ర ప్రభుత్వ పనితీరు మరింత ఆందోళనకరంగా ఉందని కమిటీ పేర్కొంది. దేశవ్యాప్తంగా 14.71 లక్షల పాఠశాలల్లో 5.23 లక్షల పాఠశాలల్లో మాత్రమే ప్రత్యేక మరుగుదొడ్లు ఉండగా, 8.08 లక్షల పాఠశాలల్లో మాత్రమే ర్యాంపులు, హ్యాండ్‌రెయిల్స్ ఉన్నాయి. అంటే సగానికి పైగా పాఠశాలల్లో వికలాంగ విద్యార్థులకు అవసరమైన కనీస వసతులు కూడా లేవని స్పష్టం చేసింది.

**నిధులు కేటాయించి ఖర్చు చేయని కేంద్రం**

సమగ్ర శిక్ష పథకం కింద 2024–25లో 186 ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.482 లక్షలు కేటాయించినప్పటికీ... అందులో రూ.2.60 లక్షలు మాత్రమే ఖర్చు చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని కమిటీ పేర్కొంది. అలాగే ప్రత్యేక విద్యా బోధకుల నియామకానికి రూ.962 లక్షలు కేటాయించినా.. ఖర్చు చేసినది రూ.80.50 లక్షలు మాత్రమే కావడం అమలు వైఫల్యాన్ని బయటపెట్టిందని వివగించింది.

# నాపైనే కుల వివక్ష

(మొదటి పేజీ తరువాయి)

పోయిందంటూ బీజేపీ అనుబంధ వర్గాలు శుద్ధి కార్యక్రమం నిర్వహించాయి. ఇది సోషల్ మీడియాతో పాటు ప్రధాన స్రవంతి మీడియాలోనూ వైరల్‌గా మారింది. దీంతో ఈ ఘటన తీవ్ర సంచలనాన్ని సృష్టించింది. కాంగ్రెస్, బీజేపీల పరస్పర విమర్శలకు దారితీసింది. ఖర్గే ప్రసంగించిన ప్రాంతంలో బీజేపీతో కలిసి శ్రీరామ్ సేన శుద్ధీకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఘటనపై ఖర్గే గురువారం రాజ్యసభలో ఆవేదనతో ప్రసంగించారు. హల్ద్వానీలో ఒక బహిరంగ సభలో ప్రసంగించిన తర్వాత ఒక అంటరానితనం తాలుకు చేదు అనుభవాన్ని తాను చవిచూడాల్సి వచ్చిందని మల్లికార్జున ఖర్గే అన్నారు. "దీనిని రాజకీయం చేద్దామని ఎప్పుడూ అనుకోలేదు.

చాలా ఏండ్లుగా నేను పార్లమెంట్లో ఉన్నాను. ప్రస్తుతం రాజ్యసభలో, గతంలో దిగువ సభలో సభ్యుడిగా ఉన్నాను. ఎప్పుడూ సానుభూతిని పొందడానికి ప్రయత్నించ లేదు. నాది షెడ్యూల్డ్ కులం, నేను దళితుడినని చెప్పి సహాయం, రక్షణ కల్పించా లని ఎన్నడూ అడుగ లేదు" అని ఆయన రాజ్యసభలో తెలిపారు. "హల్ద్వానీలో నేను ప్రసంగించినప్పుడు లక్షలాది మంది ప్రజలు ఉన్నారు. నేను ఏ కులం, మతం పేరునూ ప్రస్తావించ లేదు.

ప్రజల సమస్యలకు సంబంధించిన అంశా లను మాత్రమే ప్రస్తావించా. కానీ నా ప్రసంగం పూర్తయిన తర్వాత మీరు (బీజేపీ అనుబంధ సభ్యులు) శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించి నన్ను అవమానించడానికి ప్రయత్నించారు. అస్పృశ్యత తాలుకు బాధను మీరు అనుభవం లోకి తెచ్చారు. ప్రజాస్వామ్యంలో ఇదేం పద్ధతి? రాజ్యాంగాన్ని ఎలా పరిరక్షిస్తారు? నేను ప్రతిపక్ష నాయకుడిని. పోరాటం చేసే శక్తి ఉంది. పోరాడుతాను" అని వివరించారు. వేదికను శుద్ధి చేసిన వారిపై అంటరానితనం చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా, అలాంటి చర్యలను బీజేపీ ఎంతమాత్రమూ ప్రోత్సహించదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. దీనిపై దర్యాప్తు చేయిస్తామని ఆయన హామీనిచ్చారు.

**స్థలం పవిత్రతను ఉల్లంఘించారు**

సభాస్థలి శుద్ధి జరిగిన విషయాన్ని నిర్వాహకులు అంగీకరించారు. అక్కడో రాజకీయ సభ జరిగిందని, సభా నిర్వాహకులు చేసిన కొన్ని అభ్యంతరకర నినా దాలు ఎట్టి పరిస్థితుల్లో జరగరాదన్న లక్ష్యంతోనే అక్కడ శుద్ధీకరణ చేసినట్టు ఆ కార్యక్రమ నిర్వాహకుల్లో ఒకరు తెలిపారు. ఘటనపై ఉత్తరాఖండ్ కాంగ్రెస్ చీఫ్ గణేశ్ గొడియాల్ మాట్లాడుతూ బీజేపీతో కలిసి శ్రీరామ్ సేన శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించిందని ఆరోపించారు. ఈ ఘటనను ఆర్జేడీ ఇతర పార్టీలు ఖండించాయి. ఈ దురదృష్టకర ఘటనను ప్రధాని ఖండించాలని కాంగ్రెస్ నేత సల్మాన్ సోజ్ కోరారు.

**ఘటనతో మాకు సంబంధం లేదు : బీజేపీ**

శుద్ధి కార్యక్రమంతో తమకు ఎలాంటి సంబంధమూ లేదని బీజేపీ ఖండించింది. ఘటనను తప్పుదోవ పట్టించడానికి కాంగ్రెస్ తమపై ఆరోపణలు చేస్తున్నదని, ఇదొక విభజన వ్యూహమని ఉత్తరాఖండ్ బీజేపీ మంత్రి ఖాజన్ దాస్ అన్నారు. దళితులను తాము అవమానించ లేదని, అది మొదటి నుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నదని తెలిపారు.

# ఖర్గేకు అవమానం.. రాష్ట్రవ్యాప్త నిరసనలకు షర్మిల పిలుపు

అమరావతి– సూర్య వాస్తవం

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అవమానం జరిగిందంటూ, బీజేపీపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని బీజేపీ, హిందుత్వ సంస్థలు గంగాజలంతో శుద్ధి చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బీజేపీ కుల దురహంకారానికి, దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆరోపిస్తూ నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. ఈ ఘటనపై షర్మిల తీవ్రంగా స్పందించారు. "బీజేపీ చేసిన హవనం.. దళితుల వ్యక్తిత్వానికి జరిగిన హననం" అని ఆమె అభివర్ణించారు. దళితుల పట్ల వివక్ష చూపడమే బీజేపీ సిద్ధాంతమని, కులమతాల మధ్య విభేదాలు సృష్టించడం ఆ పార్టీ మనస్తత్వమని విమర్శించారు. రామ్ లీలా మైదానంలో ఖర్గే అడుగుపెట్టిన స్థలాన్ని శుద్ధి చేయడం బీజేపీ పాటిస్తున్న అంటరానితనానికి, అసమానతలకు అద్దం పడుతుందని ఆమె మండిపడ్డారు. ఇది సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన చర్య అని, రాజ్యాంగ విలువలను తునాతునకలు చేసే ఈ రాక్షస చర్యను యావత్ దేశం ఖండిస్తోందని తెలిపారు.

ఈ సిగ్గుమాలిన చర్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఉద్యమిస్తోందని, అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు షర్మిల ప్రకటించారు. ఆగస్టు 14వ తేదీ సాయంత్రం ప్రతి జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో భారీ మార్చ్, సత్యాగ్రహం నిర్వహించాలని ఆమె పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఈ మార్చ్‌ను స్థానిక అంబేడ్కర్ లేదా గాంధీ విగ్రహాల వద్ద ముగించి, ఖర్గేకు సంఘీభావంగా సత్యాగ్రహం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు, పార్టీ అనుబంధ విభాగాలు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని షర్మిల కోరారు. ఇటువంటి వివక్ష, విభజన కుట్రలను దేశ ప్రజలు సహించబోరని బీజేపీకి శక్తివంతమైన సందేశం పంపాలని ఆమె పిలుపునిచ్చారు.

# సంపాదకీయం

## డ్రగ్స్ ముప్పు నుంచి బయిటపడేదెలా..



తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ సమస్య ఇంతింతై వటుడింతై అన్నట్టుగా విస్తరిస్తోంది. మొదట్లో హైదరాబాద్ కు మాత్రమే పరిమితం అనుకున్న డ్రగ్స్ ఇప్పుడు.. ఎడాపెడా ఎక్కడపడితే అక్కడ పట్టుబడుతున్నాయి. చివరకు డ్రగ్స్ పెడ్లర్లలో డాక్టర్లు, టీచర్లు, విద్యార్థులు కూడా ఉండటం అందర్నీ అవాక్కయ్యేలా చేస్తోంది. అంతకుముందు పబ్బులు, క్లబ్బుల్లో మాత్రమే డ్రగ్స్ దందా జరుగుతోందనే భ్రమలో ఉన్న అధికారులకు.. ఇటీవలి కేసులు కళ్లు తెరిపిస్తున్నాయి. ఉదాహరణకు వీకెండ్‌లో డాక్టర్లంతా ఓ చోట కలుస్తుంటారు. అది పైకి సాధారణ గెట్‌టుగెదర్‌లాగే ఉంటుంది. కానీ పొరపాటున పోలీసులొస్తే.. వారంతా కంగారు పడతారు. పరారవటానికి ప్రయత్నిస్తారు. అలాంటి సందర్భాల్లో డాక్టర్ల దగ్గర డ్రగ్స్ దొరకటం చూసి పోలీసులు విస్తుపోతున్నారు. అదే సమయంలో స్కూలు బ్యాగ్‌లు, కాలేజీ క్యాంటీన్లలో డ్రగ్స్ పట్టుబడే కల్చర్ కూడా బాగా పెరిగిపోయింది. ఇప్పటికే చాలాసార్లు విద్యాసంస్థల యాజమాన్యాలకు పోలీసులు వార్నింగ్ ఇచ్చినా.. ప్రతి విద్యార్థిని 24 గంటలు తాము మాత్రం ఎలా గమనించగలమని అవి చేతులెత్తేశాయి. చివరకు క్యాంపస్‌లో డ్రగ్స్ దొరక్కుండా జాగ్రత్తపడుతున్నాయి. కానీ డ్రగ్స్ మత్తుకు అలవాటుపడ్డ విద్యార్థులు ఏదో మార్గంలో డ్రగ్స్ తీసుకుంటూనే ఉన్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం.. డ్రగ్స్ చాక్లెట్లు, డ్రగ్స్ సిగరెట్లు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అధికారులు డ్రగ్స్‌కు ఓ తలుపు మూసేస్తే.. మరో నాలుగు తలుపులు తెరుచుకుంటున్నాయి. అందుకే టాస్క్ ఫోర్స్, ఈగల్ పేరుతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినా.. అనుకున్న స్థాయిలో డ్రగ్స్‌ను కట్టడి చేయడం సాధ్యం కావడం లేదు.విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్లు..చేయాల్సిన పని వదిలిపెట్టి స్టూడెంట్స్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. కేరళలోని వడకరలో రెండ్రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన రవాణలో కేసులో ముగ్గురు టీచర్లతో సహా ఓ డెలివరీ బాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.దర్యాప్తులో భాగంగా నిందితుల వాట్సాప్ మేసేజ్ లు, బ్యాంకు అకౌంట్ల ట్రాన్సాక్షన్లు పరిశీలించిన పోలీసులు..డ్రగ్స్ సరఫరా వెనుక కింగ్ పిన్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన టీచర్లు ఇలాంటి అక్రమాలకు పాల్పడటం, డబ్బు కోసం అడ్డదారులు తొక్కడం వారి వ్యక్తిగత జీవితాలనే కాదు.. యువత భవిష్యత్తును కూడా నాశనం చేస్తుంది డ్రగ్స్ కొనుగోలుకు కావాల్సిన డబ్బుకోసం వాటి విక్రయానికి సిద్ధపడుతున్నారు. దొంగతనాలు, దోపిడీలకూ తెగబడుతున్నారు. గంజాయి మత్తు తలకెక్కి రాత్రిళ్లు వీధుల్లో గొడవలకు దిగుతూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. జీవితాలు అల్లకల్లోలమై ఆఖరికి ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. కాసుల యావతో జాతి భవితవ్యాన్ని చీకట్లోకి నెడుతున్న డ్రగ్స్ కింగ్ పిన్లకు త్వరగా శిక్షలు పడకపోతుండటం వల్లే డ్రగ్స్ వెల్లువకు అడ్డుకట్టవేయడం సాధ్యపడట్లేదు.ఎన్‌డీపీఎస్ చట్టం కింద 2022-24 మధ్య దేశవ్యాప్తంగా మూడు లక్షల కేసులు నమోదయ్యాయి. 3.75 లక్షల మంది అరెస్టయ్యారు. కానీ, 268 మందికే శిక్షలు పడ్డాయి. తనిఖీలు, నమూనాల జప్తు, తరలింపుల్లో లోపాలు, ఫోరెన్సిక్ పరీక్షల్లో ఆలస్యం వంటివి దుర్మార్గులకు వరమవుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో ప్రత్యేక ఎన్‌డీపీఎస్ కోర్టులు లేకపోవడం వల్లా కేసుల మేటలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం సంబంధిత కేసులు నాలుగు లక్షల వరకు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ వీలైనంత త్వరగా కొలిక్కి రావాలంటే- అవసరానికి తగినట్లు అన్నిచోట్లా స్పెషల్ కోర్టులను ఏర్పాటుచేయాలి. డ్రగ్స్ కేసుల దర్యాప్తులో సిబ్బందికి తగిన శిక్షణ అందించాలి. మాదకమూకల పీచమణచడంలో అన్ని రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలి. అన్నింటికన్నా ముఖ్యంగా తల్లిదండ్రులు తమ బిడ్డలు ఏం చేస్తున్నారో కనిపెట్టుకుని ఉంటూ, వారి ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి. ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డ్రగ్స్ వల్ల తలెత్తే దుష్పరిణామాలపై విద్యార్థులకు అనునిత్యం అవగాహన కల్పిస్తూ, వారిని సరైన దారిలో నడిపించాలి. లేకపోతే భావి భారతం మనం ఊహించలేనంత ప్రమాదకరంగా మారుతుందని చెప్పటానికి సంకోచించాల్సిన పని లేదు.ఈ కారణంగానే ఐఐటీ , ఐఐఎంలతో సహా దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో పెరుగుతున్న డ్రగ్ కల్చర్ కు చెక్ పెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఐఐటీ, ఐఐఎంలతో ప్రారంభించి అన్ని ఉన్నత విద్యాసంస్థల్లోనూ విద్యార్థులకు అడ్మిషన్ల సమయంలోనే స్వచ్ఛంద డ్రగ్స్ టెస్టులు నిర్వహించబోతున్నారు. ఈ మేరకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఆయా సంస్థల్లో అడ్మిషన్లు కోరే అభ్యర్థులు తమ అడ్మిషన్ పత్రాలతో పాటు యాంఫెటమైన్లు, కొకైన్, గంజాయి, బెంజోడయాజెపైన్లు, ఫెన్సైక్లిడిన్ వంటి మాదకద్రవ్యాల నిర్ధారణకు స్వచ్ఛందంగా యూరిన్ టెస్ట్ చేయించుకోవాలి. కేంద్ర విద్యా శాఖకు చెందిన ఉన్నత విద్యా విభాగం చేపట్టిన ఈ కార్యక్రమం, దేశంలో మాదకద్రవ్యాల సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా చెప్తున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మాదకద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్ 2026-29లో దీన్ని జత చేశారు. దీని ప్రకారం వచ్చే మూడేళ్లలో కేంద్ర నిధులతో నడిచే 170 ఉన్నత విద్యా సంస్థలలోని సుమారు 10 లక్షల మంది విద్యార్థులకు దశలవారీగా డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తారు.2029 నాటికి 10 లక్షల మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంపై పరీక్షలు నిర్వహించే మిషన్ ను ప్రధాని మోడీ ఆగస్టు 2న ప్రారంభించారు. దీనికి నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌గా పేరు పెట్టారు. ఢిల్లీ ఎయిమ్స్ లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ ఈ మేరకు కాలేజీలు, వర్సిటీల విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షల కోసం మార్గదర్శకాలు ఇచ్చింది. ఇందులో డ్రగ్స్ పరీక్ష పూర్తిగా స్వచ్ఛందంగా, గోప్యంగా ఉండాలని, పరీక్ష చేయించుకునే విద్యార్థులపై ఎటువంటి ప్రతికూల పరిణామాలకు దారితీయకూడదని, దీనిని కేవలం కౌన్సెలింగ్ ప్రయోజనాల కోసం మాత్రమే ఉంచాలని సూచించింది. ఈ డ్రగ్ పరీక్షల కార్యక్రమం మూడు దశల్లో అమలు చేస్తారు. మొదటి దశలో ఈ ఏడాది ఐఐటీలు, ఐఐఎంలు, ఒక సెంట్రల్ యూనివర్శిటీలో చేపడతారు. వచ్చే ఏడాది 32 ఎన్‌ఐటీలు, ఎనిమిది ఐఐఎస్ఆర్ లు, మూడు ఎస్పీఏలు, 25 ట్రిపుల్ ఐటీలు, కేంద్ర నిధులతో నడిచే నాలుగు జేఎన్టీయూల్లో చేపడతారు. ఆ తర్వాత 2028-29లో 46 సెంట్రల్ యూనివర్సిటీలు ,నాలుగు డీమ్డ్-టు-బి విశ్వవిద్యాలయాలకు వీటిని విస్తరిస్తారు. డ్రగ్స్ తాత్కాలిక ఉత్తేజాన్ని ఇవ్వొచ్చు కానీ?అవి జీవితం మొత్తాన్నీ నాశనం చేస్తాయని ప్రధాని మోడీ యువతను హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ఈ మేరకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.కాబట్టి ఎవరి పిల్లల గురించి వారే మొదట జాగ్రత్తలు తీసుకోవాలి. స్కూళ్లు, కాలేజీల నుంచి టైంకి ఇంటికొస్తున్నారా.. లేదా..? బ్యాగుల్లో ఏం తీసుకెళ్తున్నారు..? ఎలాంటి స్నేహితులతో తిరుగుతున్నారు..? లాంటి కనీస జాగ్రత్తలు పాటించటం అత్యవసరమని నిపుణులతో పాటు ప్రభుత్వాలు కూడా సూచిస్తున్నాయి. ఎందుకంటే ప్రతి ఇల్లు డ్రగ్స్ రహితం కావాలనే సంకల్పం తీసుకుంటే.. ఆటోమేటిగ్గా హైదరాబాద్, తెలుగు రాష్ట్రాలు కూడా డ్రగ్స్ రహితం కావడం పెద్ద కష్టం కాదు. చివరిగా దేశం కూడా డ్రగ్స్ నుంచి విముక్తం అవుతుంది.




# ఏపీఎస్పీ పోలీస్ సిబ్బంది విధులకు వారి కుటుంబ త్యాగాలకు .... సెల్యూట్..!

ఇందు గలడు అందు లేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండు ఎందెందు వెదకి చూచిన అందందే గలడు....... ఇది బమ్మెర పోతన రచించిన పద్యం ఏపీఎస్పీ పోలీసులకు కరెక్ట్ గా సరిపోతుంది .... ఏపీఎస్పీ పోలీసులు ఏ విభాగాల్లో ఉన్నారు అని అడగగా.... ఇలాంటి సమాధానమే చెబుతారు.... అలా అన్నిట్లో వారు విధులు నిర్వహిస్తున్నారు మరి.....! ఆ విధులు ఏమిటంటే.... గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్, పొలిటికల్ ఇంటెలిజెన్స్, ముఖ్యమంత్రి నుండి మంత్రులందరికీ గన్‌మ్యాన్ డ్యూటీ, ఇతర రాష్ట్ర ఎన్నికల డ్యూటీ, వీఐపీ కవాతులు, వీఐపీ బందోబస్త్ విధులు, ఎస్ ఎస్ జి విధులు, ఏపీ భవన్ ఢిల్లీ విధులు, రైల్వే విధులు, రెడ్ శాండిల్ స్పెషల్ పోలీస్, సిఐడి, ఈగల్ సెల్, స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్, ఎన్ ఎస్ జి, పి టి ఓ డ్రైవర్స్, ఎస్ డి ఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ ఎఫ్ , టీటీడీ విజిలెన్స్, ఆల్ డిస్టిక్ ట్రైనింగ్ (పి టి సి ), ఏపీ జెన్కో, ఏపీ ట్రాన్స్కో, అసెంబ్లీ మార్షల్స్, పి టి ఓ అటాచ్మెంట్, ఐ బి, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్, డి జీ పి ఆఫీస్,.... ఇలా అన్ని పోలీస్ విభాగాల్లో వారు ఉన్నారు. ఇన్ని డ్యూటీలు చేసిన వారు కన్వెన్షన్ లో తీసుకుంటే వారు చేయలేని డ్యూటీలు ఏముంటాయి....!

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ సిబ్బంది రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు విధులు, విపత్తుల నిర్వహణ మరియు తీవ్రవాద నిరోధక చర్యల్లో కీలక పాత్ర పోషిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ బెటాలియన్లలో వీరు చురుక్క సేవలు అందిస్తారు.శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు సివిల్ పోలీసులకు అదనపు బలగాలుగా సహాయపడుతుంటారు. ఏపీఎస్పీ సిబ్బంది తమ విధి నిర్వహణలో భాగంగా నిరంతరం భార్య, పిల్లలకు మరియు కుటుంబానికి దూరంగా గడపాల్సి రావడం వల్ల తీవ్రమైన వ్యక్తిగత, మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. బెటాలియన్లలో ఉండే కఠినమైన పని వేళలు, నిరంతర బందోబస్తు డ్యూటీలు, మరియు తరచూ జరిగే బదిలీల కారణంగా వీరు కుటుంబ జీవితానికి నోచుకోలేకపోతున్నారు. నెలల తరబడి వేర్వేరు ప్రాంతాలలో బందోబస్తు విధులు నిర్వహించడం వల్ల పిల్లల చదువులు, ఎదుగు దలలో భాగస్వాములు కాలేకపోతున్నారు. భార్యా పిల్లల క్షేమసమాచారాలు నేరుగా చూసుకోలేక పోవడం, ఒంటరితనం వల్ల సిబ్బంది తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో లేదా కుటుంబ పండుగలు, శుభకార్యాలప్పుడు కూడా సకాలంలో సెలవులు దొరకడం కష్టంగా మారుతోంది. సుదీర్ఘకాలం దూరంగా ఉండటం వల్ల కొన్ని సందర్భాల్లో కుటుంబాలలో మనస్పర్థలు, కౌన్సిలింగ్ కేంద్రాలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి

**అమరావతి క్రైమ్ - సూర్య వాస్తవం :**

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ (ఏపీఎస్పీ) సిబ్బందికి 10 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన వెంటనే 100 శాతం ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) కన్వర్షన్ కల్పించాలని కోరుతూ సిబ్బంది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి వినతిపత్రం సమర్పించారు. 1999లో జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 299ను యథాతథంగా అమలు చేసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఎన్నికల విధులు, ఇతర రాష్ట్రాల్లో డ్యూటీలు, ఢిల్లీ డ్యూటీలు, ఆక్టోపస్, ఇంటెలిజెన్స్, గ్రేహౌండ్స్, వీఐపీ బందోబస్తు, మతపరమైన ఉత్సవాలు, ప్రజా ఉద్యమాలు, ప్రకృతి విపత్తుల సమయంలో ఏపీఎస్పీ సిబ్బంది కీలక సేవలు అందిస్తున్నారని తెలిపారు. విధుల స్వభావం కారణంగా ఏళ్ల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**1999 నాటి జీవోను అమలు చేయాలి**

1999లో జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 299 ప్రకారం 10 సంవత్సరాల సర్వీస్ పూర్తిచేసిన ఏపీఎస్పీ సిబ్బందికి వారి సొంత జిల్లాల ఆర్మ్డ్ రిజర్వ్‌కు 100 శాతం కన్వర్షన్ కల్పించే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అయితే 2010లో జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 329 ద్వారా ఈ కన్వర్షన్‌ను 40 శాతానికి పరిమితం చేయడంతో సమస్య మరింత తీవ్రమైందన్నారు. ప్రస్తుతం 18, 20, 24 సంవత్సరాల సర్వీస్ పూర్తయినప్పటికీ పలువురు సిబ్బంది ఏఆర్ కన్వర్షన్ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. జిల్లాల్లో పరిమిత ఖాళీలు ఉండటంతో కన్వర్షన్ కోసం సంవత్సరాల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని పేర్కొన్నారు.

**సీనియారిటీని వదులుకొని అయిన కన్వర్షన్ కోసం నిరీక్షణ**

కన్వర్షన్ అనంతరం సర్వీస్ సీనియారిటీ పరిరక్షణ లేకపోవడం వల్ల కొందరు సిబ్బంది సుమారు ఏడేళ్ల వరకు జూనియర్లుగా పరిగణించబడుతున్నారని తెలిపారు. దీనివల్ల ప్రమోషన్లు, ఇతర సర్వీస్ ప్రయోజనాల్లో నష్టం జరుగుతోందని వివరించారు.అదేవిధంగా 6, 12, 18 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన ఏపీఎస్పీ సిబ్బందికి గ్రేడ్ ఇన్క్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. ఏఆర్ కన్వర్షన్ కోసం ప్రమోషన్లను వదులుకుంటున్న సిబ్బందికి గ్రేడ్ ఇంక్రిమెంట్ కూడా అందకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**సిబ్బంది పిల్లలు స్థానికత్వం పై ఆవేదన**

ఏపిఎస్పీ సిబ్బంది విధుల నిమిత్తం రాష్ట్రంలో బెటాలియన్ లోని కంపెనీలకు డిప్టేషన్స్, అటాచ్మెంట్ బదిలీ అవుతుంటారు. దీనివల్ల సిబ్బంది పిల్లలు ఒకే ప్రాంతంలో వరుసగా 4 లేదా 7 సంవత్సరాలు చదువుకోలేకపోవడంతో లోకల్ స్టేటస్ స్థానికత్వం కోల్పోతున్నారని సోషల్ మీడియా ద్వారా వారి ఆవేదన వెల్లిబుచ్చుకుంటున్నరు

**సోషల్ మీడియా ద్వారా వారి ప్రధాన డిమాండ్లు**

- జీవో ఎంఎస్ నంబర్ 299ను యథాతథంగా అమలు చేసి 10 ఏళ్ల సర్వీస్ పూర్తయిన వారికి 100 శాతం ఏఆర్ కన్వర్షన్ కల్పించాలి.
- జీవో ఎంఎస్ నంబర్ 329 ద్వారా 40 శాతానికి పరిమితం చేసిన కన్వర్షన్ నిబంధనను పునఃసమీక్షించాలి.
- 6, 12, 18 సంవత్సరాల గ్రేడ్ ఇంక్రిమెంట్లు అమలు చేయాలి.

**ప్రమోషన్లు, సర్వీస్ నష్టపోతున్న సిబ్బంది...!**

కుటుంబ సంక్షేమం, పిల్లల విద్య, వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. ఏపీఎస్పీ సిబ్బంది సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి, 1999లో తీసుకున్న నిర్ణయాన్ని పునరుద్ధరించడం ద్వారా వేలాది పోలీసు కుటుంబాలకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సిబ్బంది కోరారు.

ఎం. సులేమాన్ సాహెబ్
క్రైమ్ రిపోర్టర్, సూర్య వాస్తవం దినపత్రిక

# మిత్రపక్షాల మధ్య డిజిటల్ వార్




**విజయవాడ - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి తమ సోషల్ మీడియా శ్రేణులను అప్రమత్తం చేస్తూ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. కొద్దిరోజులుగా సోషల్ మీడియా వేదికగా టీడీపీ, జనసేన సైనికుల మధ్య సాగుతున్న పరస్పర విమర్శలు, వ్యక్తిగత దూషణలు శృతిమించి కూటమి ఐక్యతకే సవాలుగా మారిన తరుణంలో నాయకత్వం ఈ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. గొడ్డలి పార్టీ కుట్రపూరితంగా సృష్టిం చిన నకిలీ ఖాతాల వల్ల ఈ అంతర్గత కలహాలు నడుస్తున్నాయని, ఆ ట్రాప్‌లో పడ వద్దని కూటమి సోషల్ మీడియా కోఆర్డినేషన్ కమిటీ స్పష్టమైన ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని వారాలుగా సోషల్ మీడియాను గమనిస్తే.. పశ్చిమ ఏపీలోని అధికార సమన్వయం నుంచి మొదలుకొని, సినిమాలు, ఐకాన్స్, రాజకీయ ప్రాధాన్యతల వరకు టీడీపీ-జనసేన క్యాడర్ మధ్య ఘాటైన సైబర్ యుద్ధమే సాగుతోంది. సినిమాల నుంచి సీనియర్ ఎన్టీఆర్ ఆహారపు అలవాట్ల వరకూ తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేసుకోవడం నిత్యకృత్యమైంది. గ్రౌండ్ లెవల్‌లో నాయకుల మధ్య సఖ్యత ఉన్నప్పటికీ, సోషల్ మీడియా డిజిటల్ స్పేస్‌లో చోటు చేసుకుంటున్న ఈ తీవ్ర స్వభావపు విమర్శలు అసలైన కార్యకర్తల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రత్యర్థులకు బలమైన రాజకీయ ఆయుధాన్ని అందించాయి.ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని విపక్ష వైసీపీ సైబర్ వింగ్ అత్యంత వ్యూహాత్మకంగా సూడో అకౌంట్స్ నడుపుతోందని కూటమి సంయుక్త ప్రకటన ఎండగట్టింది. ఒక టీడీపీ అభిమానిలా ప్రొఫైల్ రూపొందించి పవన్ కల్యాణ్‌ను హేళన చేయడం, అలాగే జనసేన సైనికుడి ముసుగులో చంద్రబాబు లేదా లోకేష్‌లను వ్యక్తిగతంగా విమర్శించడం ద్వారా ఇరు వర్గాల అసలైన కార్యకర్తలను రెచ్చగొడుతున్న వైనాన్ని కమిటీ గుర్తించింది. ఈ డిజిటల్ ట్రాప్ వల్ల నిజమైన సైనికులు ఆవేశానికి లోనై ఒకరినొకరు కించపరుచుకుంటూ, చివరికి తమ సొంత ప్రభుత్వ విజయావకాశాలను, పథకాల ప్రచారాన్ని పక్కనబెట్టి అంతర్గత పోరులోనే శక్తిని వృధా చేసుకుంటున్నారు.రాజకీయాల్లో క్షేత్రస్థాయి ఐక్యత ఎంత ముఖ్యమో, డిజిటల్ మైండ్ స్పేస్‌లో పొత్తు ధర్మాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే కీలకం. శ్రేణుల మధ్య స్వల్ప విబేధాలు కాస్తా పార్టీల అగ్రనేతల మధ్య వైరి వర్గాలుగా రూపాంతరం చెందే ప్రమాదం ఉందని గ్రహించినందునే ఈ ఉమ్మడి ప్రకటన వెలువడింది. సంయమనం పాటించకపోతే, మిత్రపక్షాల నేతలను లక్ష్యంగా చేసుకుని విద్వేషం చిమ్మే ఏ అకౌంట్‌పైనా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేయడం మంచి పరిణామం అనుకోవచ్చు. ఆవేశాన్ని పక్కనబెట్టి, ప్రత్యర్థుల నకిలీ వ్యూహాలను తిప్పికొడుతూ ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపైనే కూటమి సోషల్ సైన్యాలు దృష్టి సారించాల్సి ఉంది.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

**- ప్రజాదర్బార్ నిర్వహించిన మంత్రి పయ్యావుల కేశవ్**





**ఉరవకొండ - సూర్య వాస్తవం :** అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు క్యాంపు కార్యాలయానికి తరలివచ్చి తమ సమస్యలను మంత్రివర్యుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు అందజేసిన వినతులను మంత్రి పయ్యావుల కేశవ్ స్వయంగా పరిశీలించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పలు సమస్యలపై మంత్రి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు.

## ఐదుగురు మాజీ సైనిక ఉద్యోగులను సత్కరించిన మున్సిపల్ కమీషనర్



**గుత్తి- సూర్య వాస్తవం :** గుత్తి అర్బన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వ హించనున్న 80వ భారత దేశ స్వా తంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా గుత్తి మున్సిపాలిటి పరిధిలో గల ఐదుగురు మాజీ సైనిక ఉద్యోగులు కృష్ణయ్య, లక్ష్మీపతి, రామామూర్తి, నాగేంద్ర, శ్రీనివాసులుకి గౌరవంతో సత్కరించడం జరిగిందని మున్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లా డుతూ దేశం నలుమూలల సైనికు లు వారి ప్రాణాలను పణంగా ఉంచి దేశ ప్రజలకు భద్రతను కలిస్తున్న ప్రతి సైనికున్ని గౌరవంతో సత్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాంబాబు, ఆర్.ఓ దాసరది, డి.ఈ.ఈ హేమచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఏ.ఈ గోవిందప్ప, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యాదవ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జిల్లా యాదవ మహిళా అధ్యక్షురాలు



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పామిడి పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయంలో పామిడి యాదవ సోదరుల ఆధ్వర్యంలో యాదవ ఆ త్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర యాదవ కా ర్పొరేషన్ డైరెక్టర్ ఆమ్లెట్ మస్తాన్ యాదవ్,జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి యాదవ్, జి ల్లా యాదవ అధ్యక్షులు రామకృష్ణ యాదవ్,జిల్లా యూత్ అధ్యక్షులు ఆస్వార్థ యాదవ్, అనంతపురం జిల్లా యాదవ మహిళా ఆధ్యక్షురా లు చంద్రగిరి రాధ యాదవ్ పాల్గొ న్నారు.ఈ సందర్భంగా చంద్రగిరి యాదవ్ మాట్లాడుతూ పామిడి యాదవ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సంఘటితమై ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత మనస్పర్థలను పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.రాబో యే శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో యాదవ సోదరులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, వెడుకలను ఘనంగా నిర్వ హించి విజయవంతం చేయాలని కోరారు.

## నారాయణ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న వైసీపీ యువ నేత మంజునాథ్ రెడ్డి

**పామిడి - సూర్య వాస్తవం :** గుంతకల్లు నియోజకవర్గం పామిడి మండలం గజరాం పల్లి గ్రామంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యూత్ వింగ్ మండల ఉపాధ్యక్షులు రఘురామ్ రెడ్డి తండ్రి నక్కనారాయణ రెడ్డి గుండె పోటుతో మరణించిన విషయం తెలుసుకున్న వెంటనే వైస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంతకల్లు నియోజకవర్గం యువ నేత సి బీ.మంజునాథ్ రెడ్డి పామిడి మండలం గజరాంపల్లి గ్రామంలో ఉన్న శ్వాషణ వాటికలో జరిగిన నారాయణ రెడ్డి అంతక్రియల్లో పాల్గొని పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. వారితో పాటు మండలం వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



# అనంతపురం అర్బన్ అభివృద్ధే లక్ష్యం

**- సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట**
**- ప్రజా సంక్షేమానికి పెద్దపీట: ఎమ్మెల్యే దగ్గుపాటి**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** దేశంలోని మరే రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. 5వ డివిజన్‌లో నిర్వహించిన ఇంటింటికీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. శ్రీనివాస నగర్‌లోని పెద్దమ్మ దేవాలయం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. రెండేళ్లలో డివిజన్‌లో సుమారు రూ.కోటి విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రూ.20 లక్షల విలువైన పనులు కూడా సక్రమంగా జరగలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తొలి ఐదు సంతకాలతో ఇచ్చిన కీలక హామీలను అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేశారని ఆరోపించిన ఎమ్మెల్యే, పుస్తకాలు, బ్యాగులపై కూడా అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు ముద్రించారని విమర్శించారు. ప్రస్తుతం మంత్రి నారా లోకేష్ విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని తెలిపారు.తల్లికి వందనం పథకం కింద 5వ డివిజన్‌లో రూ.67.50 లక్షలు అందుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, ఉద్యోగాలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్బన్ నియోజకవర్గాన్ని ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తున్నామని దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో ఘనంగా “హర్ ఘర్ తిరంగా”

**- త్రివర్ణ పతాకాలతో విద్యార్థుల భారీ ప్రదర్శన..**
**- మార్మోగిన దేశభక్తి నినాదాలు**



**కనేకల్ - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా కనేకల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో “హర్ ఘర్ త్రిరంగా” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఈ. ఆంజనేయులు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డీకే రవి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం లో భాగంగా విద్యార్థులు చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. జాతీయ జెండాలతో విద్యార్థులు క్రమశిక్షణగా కదులుతూ దేశ సమైక్యత, సమగ్రతను చాటారు. విద్యార్థుల భారీ ప్రదర్శనతో కనేకల్ పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఈ. ఆంజనేయులు మాట్లాడుతూ జాతీయ జెండా ప్రతి భారతీయుడి గౌరవానికి, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది స్వాతంత్ర్య సమర యోధులు చేసిన త్యాగాలను నేటి యువత ఎప్పటికీ మరచిపోకూడదని సూచించారు. జాతీయ జెండా ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతో పాటు, దేశం పట్ల బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

“హర్ ఘర్ తిరంగా” కార్యక్రమం కేవలం జాతీయ జెండాను ఎగురవేయడం వరకే పరిమితం కాకుండా, ప్రతి ఒక్కరిలో దేశభక్తి, జాతీయ ఐక్యత, సమగ్రత, బాధ్యతాభావాన్ని పెంపొందించే కార్యక్రమంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. యువతలో దేశభక్తి భావాలను బలపరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డీకే రవి నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక బాధ్యతతో పాటు దేశం పట్ల తమ కర్తవ్యాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ పతాకాన్ని గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో విద్యార్థులు “భారత్ మాతాకీ జై”, “వందే మాతరం” వంటి దేశభక్తి నినాదాలతో ఉత్సాహాన్ని నింపారు. త్రివర్ణ పతాకాలతో విద్యార్థుల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. కళాశాల ఆవరణతో పాటు పట్టణంలోని ప్రధాన వీధుల్లోనూ దేశభక్తి వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమం ద్వారా జాతీయ జెండా పట్ల గౌరవం, దేశభక్తి, జాతీయ సమైక్యత వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు కళాశాల యాజ మాన్యం కృషి చేసింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒకే వేదికపై త్రివర్ణ పతాకాలతో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో నిర్వాహకులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి వెంకటేశులు, ఎస్ అన్వర్ భాష, రామాంజనేయులు, ధనుంజయ, ప్రసాద్, శైలజ ,తదితరులు పాల్గొన్నారు

## సేవా కార్యక్రమాలతో మురళీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**- నిరుపేద మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కుట్టు శిక్షణ**
**- గర్భిణులకు ఉచిత భోజన వసతి.. మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ**
**- పేద ప్రజలకు అండగా పోచిమిరెడ్డి సేవాదళ్ - మురళీధర్ రెడ్డి సేవా కార్యక్రమాలపై ప్రజల ప్రశంసలు**





**పత్తికొండ టౌన్- సూర్య వాస్తవం :** పోచిమిరెడ్డి మురళీధర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పోచిమిరెడ్డి సేవాదళ్ కార్యాలయం లో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ శ్రీ శారద వృద్ధాశ్రమంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.కుట్టు శిక్షణ పొందుతున్న మహిళల ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు అన్నదానం చేశారు. వృద్ధులతో కలిసి జన్మదిన వేడుకలు నిర్వహించడం ద్వారా సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పోచిమిరెడ్డి సేవాదళ్ సభ్యులు, కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.పేద ప్రజలకు అండగా పోచిమిరెడ్డి సేవాదళ్ పోచిమిరెడ్డి మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలోని సేవాదళ్ ద్వారా పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని పేద ప్రజలకు వివిధ రకాల సేవలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు ఉచిత భోజన వసతి కల్పించడంతో పాటు, నిరుపేద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న మురళీధర్ రెడ్డి సేవా కార్యక్రమాలను పత్తికొండ పరిసర గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు. జన్మదిన వేడుకలను సైతం సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా ఆయన సేవా దృక్పథాన్ని మరోసారి చాటుకున్నారని పలువురు పేర్కొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగేలా సమిష్టిగా కృషి చేద్దాం

**- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ జగదీష్ సమీక్ష**
**- ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు**
**- బందోబస్తులో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచన**
**- సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలి: ఎస్పీ జగదీష్**





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎలాంటి లోపాలు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వ యంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్, సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టనున్న భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు, రియల్ టైం ఫుల్ డ్రెస్ పరేడ్ రిహార్సల్స్‌ను జిల్లా ఎస్పీ పరిశీలించి అధికారులతో సమీక్షించారు. పరేడ్ ఏర్పాట్లతో పాటు వేడుకలకు హాజరయ్యే ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, ప్రజలకు పటిష్టమైన భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వేడుకల ప్రాంగణంలో డిఎఫ్ఎండి తనిఖీల ద్వారా భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని, పార్కింగ్, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు.అలాగే వేడుకల్లో పోలీసు జాగిలాల ప్రదర్శనకు సంబంధించిన ఏర్పాట్లను కూడా పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఎలాంటి లోపాలు లేకుండా ఘనంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి. భద్రత విషయంలో ఎక్కడా రాజీ లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలి” అని జిల్లా ఎస్పీ అధికారులకు సూచించారు.

## వైసీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటా

**- ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి**



**పామిడి - సూర్య వాస్తవం:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి నివాసంలో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి ముఖ్య అనుచరుడు గుంతకల్లు నియోజకవర్గం పరిశీలకులు శివారెడ్డి సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని పామిడి మండలం రాజకీయ స్థితిగతుల గురించి చర్చించడం జరిగింది. కష్టకాలంలో పార్టీకి కష్టకాలంలో కూడా ఎప్పటికీ అండగా ఉండి 2029లో వై.వెంకటరామిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించు కుంటామని చెన్నకేశవరెడ్డి భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పామిడి టౌన్ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి బీసీసెల్ జిల్లాకార్యదర్శి మీసాల రామచంద్ర,,జిల్లా యువజన విభాగం కార్యదర్శి సూరి, నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ రెక్కల చంద్రశేఖరరెడ్డి, తుళ్ళాభాయ్, రామ్మోహనరెడ్డి ,సాకే ఓబులేష్,వెంకట్ గుప్తా, మహేష్ రెడ్డి, పుంజానాగేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ విచారణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

**- హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**

**- నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేయాలని సూచన**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని నాయక్ నగర్‌లో ఉన్న 49వ సచివాలయం పరిధిలోని 179, 180, 181 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఎస్ఐఆర్‌లో భాగంగా కొనసాగుతున్న విచారణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఐఏఎస్., స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులపై నిర్వహిస్తున్న విచారణ (హియరింగ్) ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విచారణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

## రహమత్పూర్ 15వ వార్డులో మురుగు కాలువల దుస్థితి

**- రోజుల తరబడి కాలువల శుభ్రతపై నిర్లక్ష్యం - కాలువలు నిండిపోయి దోమల బెడద..**

**పట్టించుకోని మున్సిపల్ అధికారులు - పారిశుధ్య చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి**

**హిందూపురం టౌన్ - సూర్య వాస్తవం:** పట్టణంలోని రహమత్పూర్ 15వ వార్డులో మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. కాలువలు చెత్తాచెదారం, మురుగు నీటితో నిండిపోయి రోజుల తరబడి శుభ్రం చేయక పోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. మురుగు కాలువల్లో నీరు నిలిచిపోవడంతో దోమల బెడద విపరీతంగా పెరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.



కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, మురుగునీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు.మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి 15వ వార్డులోని మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## విలేకరులను వివాహానికి ఆహ్వానించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణ టీడీపీ కార్యాలయంలో గుంతకల్లు శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత పామిడి, గుత్తి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, ఆయన సోదరుడు ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు తనయుడు యువనేత గుమ్మనూరు మహి ఈ నెల 30వ తారీకు న జరగబోయే తన సోదరి వివాహానికి రావాలని గుత్తి పట్టణ, మండల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక మీడియా సోదరులను మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందించి వారిని ఆహ్వానించారు. అదేవిధంగా గుత్తి పట్టణ, మండల కూటమి నాయకులకు వివాహ ఆహ్వాన పత్రికను అందించి తన సోదరి వివాహానికి కచ్చితంగా హాజరుకావాలని గుమ్మనూరు ఈశ్వర్ కోరారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.



# అనంతపురంలో నేడు 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

**- ఉదయం 8 గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ**

**- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి: కలెక్టర్ ఓ. ఆనంద్**

**- ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు**

**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :**80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 14న అనంతపురం నగరంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. ఉదయం 8 గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు. ర్యాలీలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పుర ప్రముఖులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, క్రీడా కారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తూ దేశభక్తిని చాటేలా ర్యాలీ నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలు, వార్డు స్థాయిల్లోనూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను



ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులను కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని కలెక్టర్ కోరారు. అపార్ట్మెంట్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమలు, దుకాణాలు తదితర ప్రాంతాల్లోనూ జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని తెలిపారు. కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను జిల్లా కంట్రోల్ రూమ్‌తో పాటు నోడల్ అధికారికి పంపించాలని సూచించారు. అలాగే ప్రజలు తమ ఇంటి ముందు జాతీయ జెండాతో సెల్ఫీలు తీసుకుని 'హర్ ఘర్ తిరంగా' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు.

జిల్లా అధికారులు తమ కింది స్థాయి సిబ్బందికి కార్యక్రమాలపై అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు అందిస్తూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి బీసీ రోడ్డు గుఝుడా అంబేద్కర్ విగ్రహం వరకు బిజెపి మండల అధ్యక్షులు చౌహన్ అంజినాయక్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి, గుంతకల్ మాజీ శాసనసభ్యులు మధుసూదనగుప్తా రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి, శ్రీనివాసులు హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు దాదాపు 2,500 మంది 240 మీటర్ల త్రివర్ణ పతాకాన్ని విద్యార్థులు చేత బూని జైభారత్ జై జై భారత్ అంటూ నినాదాలతో పామిడి పట్టణ బీసీసీ రోడ్డు మరియు పట్టణ పురవీధుల గుండా ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు.,దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటారు. విద్యార్థుల భారీ త్రివర్ణ పతాక ప్రదర్శన, దేశభక్తి నినాదాలతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయజెండా భారతదేశ గౌరవానికి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు, సార్వభౌమ త్వానికి ప్రతీకని పేర్కొన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని దాని ద్వారా దేశభక్తిని చాటాలని, యువతలో జాతీయ భావాలను మరింతగా పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.హర్ ఘర్ తిరంగా"కార్యక్రమం ద్వారా ప్రతి






ఒక్కరిలో దేశభక్తి, జాతీయ ఐక్యత, దేశం పట్ల బాధ్యత అనే భావనలు మరింత బలపడుతాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు తహసిల్దార్ షర్మిల,ఎంపీడీవో ప్రభాకర్, ఎంఈఓ జయనాయక్, ఏపీవో ఆదినారాయణమ్మ, ఈవో శివమూర్తి, ఏఈ మధుసూదనరావు,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ, టిసి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్ కుమార్,చైతన్య స్కూల్ కరెస్పాంటెడ్ రమణారెడ్డి, ఎస్ఎఫ్ఐ స్కూల్, నలంద స్కూల్ రవి, ట్రినిటీ స్కూల్ పట్టణంలో ఉన్నటువంటి పలు పలు పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయ బృందాలు పాల్గొన్నారు ఏపీవో నల్లప్ప అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆంజనేయులు జిల్లా కార్యదర్శి కవితశర్మ బిజెపి పామిడి మండల ఇన్‌చార్జ్ డాక్టర్ పోగుల నాగేంద్రబాబు, రాజశేఖర్, జోజోడేకుమార్, పత్రా శ్రీనివాసులు, దివాకర్, పవన్,బెస్త నాగేంద్ర తదితర వేలాదిమంది విద్యార్థులు ప్రజలు పాల్గొని దేశభక్తిని, సంఘీభావాన్ని చాటారు.

## ఎమ్మెస్ జూనియర్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ చౌక్ సమీపంలో ఉన్నటువంటి ఎమ్మెస్ జూనియర్ కళాశాల విద్యార్థులు దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిచెప్పే ఉద్దేశంతో కళాశాల హెచ్ఓడి సయ్యదా నస్రిన్ కళాశాల క్యాంపస్ ఇంచార్జ్ ఖాజాబీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో పట్ట ణంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు.ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని, జాతీయ జెండా పట్ల ప్రతి ఒక్కరూ గౌరవ భావా న్ని కలిగి ఉండాలని విద్యార్థులు ప్ర జలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రతినిధులు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కా ర్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో జాతీ య జెండా రెపరెపలాడేలా చేయడంతో పాటు యువతలో దేశభక్తి, జాతీ య ఐక్యత,బాధ్యతాయుత పౌరస త్వ భావనలను పెంపొందించడమే తమ లక్ష్యమనితెలిపారు. అనంతరం కళాశాలలో ఆగస్టు 15న ని ర్వహించేటువంటి స్వాతంత్ర వేడుకలలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సోదరి వివాహానికి ఆహ్వానించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**పామిడి - సూర్య వాస్తవం :** గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కూతురు వివాహానికి పామిడి పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత పామిడి, గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఈ నెల 30వ తారీకున జరగబోయే తన సోదరి వివాహానికి రావాలని పామిడి పట్టణ మండల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోద రులను మర్యాద పూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందించి వారిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. అదేవిధంగా పామిడి పట్టణ, మండల కూటమి నాయకులకు వివాహ ఆహ్వాన పత్రికను అందించి తన సోదరి వివాహానికి కచ్చితంగా హాజరుకావాలని గుమ్మనూరు ఈశ్వర్ కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో ప్రతి ఇంట జాతీయ జెండా రెపరెపలాడాలి

**- పిలుపునిచ్చిన మంత్రి సత్య కుమార్ యాదవ్**






**దొరవారిసత్రం -సూర్య వాస్తవం** :విజయవాడలో నిర్వహించిన తిరంగా యాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్,పార్టీ జాతీయ కార్యదర్శి అనిల్ కె.ఆంటోనీ,విద్యార్థులతో కలిసి రాష్ట్ర వైద్య, ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ,స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ యాత్రలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు.ఎందరో మహనీయుల త్యాగాలు,బలిదానాల ఫలితంగా లభించిన స్వాతంత్ర్యాన్ని స్మరించుకుంటూ"హర్ ఘర్ తిరంగా"స్ఫూర్తితో ప్రతి ఇంటా జాతీయ జెండా రెపరెపలాడాలని పిలుపునిచ్చారు.తిరంగా మన గర్వం...దేశభక్తి మన స్ఫూర్తి,వికసిత్ భారత్ మన సంకల్పం!

## శ్రీధనమల్లిలో ఇంటింటికీ టీడీపీ

**- మాజీ సర్పంచ్ పురుషోత్తం, గ్రామ టీడీపీ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన "డోర్ టూ డోర్"కార్యక్రమం**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం** : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ చేరవేసే లక్ష్యంతో దొరవారిసత్రం మండలం పరిధిలోని శ్రీధనమల్లి పంచాయతీ నందు గురువారం మాజీ సర్పంచ్ పురుషోత్తం మరియు గ్రామ టీడీపీ అధ్యక్షులు జ్ఞానేశ్వర్, పిట్టి రమణయ్య ఆధ్వర్యంలో"డోర్ టూ డోర్"(ఇంటింటికీ తెలుగుదేశం)కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా,సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ శ్రీమతి నెలవల విజయశ్రీ విశేష చొరవ మార్గదర్శకత్వంలో, దొరవారిసత్రం మండలం శ్రీధనమల్లి పంచాయతీ పరిధిలో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు సారథ్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు.

గడపగడపకూ ప్రభుత్వ సంక్షేమంలో గత రెండేళ్ల కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన విప్లవాత్మక సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరించారు. ప్రజల నుంచి అపూర్వ స్పందన,ఇంటింటి ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నేతృత్వంలోని ప్రభుత్వ పాలనపై హర్షం వ్యక్తం చేశారు.సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్న తీరును ప్రజలు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.భాగస్వామ్య నాయకులు,ఈ కార్యక్రమంలో శ్రీధనమల్లి పంచాయతీ పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులు,బూత్ స్థాయి కన్వీనర్లు, ఎంపీటీసీలు మరియు పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ?ప్రజల సంక్షేమమే ధ్యేయంగా,నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రివర్యుల చంద్రబాబు నాయుడు సహకారంతో నిరంతరం శ్రమిస్తున్నాం.ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు చేరడమే మన ప్రభుత్వ అసలైన విజయమని,ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమం ద్వారా శ్రీధనమల్లి పంచాయతీలో పండుగ వాతావరణం నెలకొనగా, తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్ తో వ్యక్తి మృతి

**- మరో వ్యక్తికి గాయాలు**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం** : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కడపత్ర పంచాయతీ తోటకట్ల గ్రామానికి చెందిన కత్తి నాగరాజు విద్యుత్ షాక్ ప్రమాదానికి గురిఅయి మృతి చెందాడు.మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అవడంతో మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. రోజులాగే బాబూజీ కాలనీలో సెంట్రింగ్ పనికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఇనప రాడ్లను కట్ చేసి మిద్దె పైకి తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు తీగలకు(11 కె వి) తగిలి నాగరాజు అనే వ్యక్తి అక్కడికక్కడే మరణించారు.రెంటమల్లు శశి అనే వ్యక్తికి తీవ్ర గాయాలవడంతో మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.విషయం తెలుసుకున్న ఎస్ఐ అజయ్ కుమార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఆర్థిక ప్రగతితో పాటు ప్రజల ఆరోగ్యం కూడా అత్యంత కీలకం

**- ఆరోగ్యంవంతమైన సమాజమే స్థిరమైన ఆర్థిక అభివృద్ధికి పునాది : మంత్రి సత్య కుమార్"**






**దొరవారిసత్రం -సూర్య వాస్తవం** : ఆర్థిక ప్రగతితో పాటు ప్రజల ఆరోగ్యం కూడా అత్యంత కీలకం అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఆయన గురువారం విజయవాడలోని లెమన్ ట్రీ హోటల్‌లో సిఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 2అండ్ నేషనల్ ఓబేసిటీ సుమ్మిట్--2026లో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధి,ఆర్థిక ప్రగతితో పాటు ప్రజల ఆరోగ్యం కూడా అత్యంత కీలకమని, ఆరోగ్యవంతమైన సమాజమే స్థిరమైన ఆర్థికాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఊబకాయం, మధుమేహం,రక్తపోటు వంటి జీవనశైలి సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో చికిత్సతో పాటు నివారణ,ముందస్తు గుర్తింపు,ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 59 లక్షల మంది రక్తపోటుతో, 48 లక్షల మంది మధుమేహంతో,74 లక్షల మంది రక్తపోటు--మధుమేహం రెండింటితో ప్రభావిత మవుతున్న నేపథ్యంలో సమగ్ర చర్యలు అవసరమని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 10 రకాల అసంక్రమిత వ్యాధులపై జిల్లా స్థాయి మ్యాపింగ్ చేపడుతున్నామని, త్వరలో యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ ద్వారా 41 రకాల పరీక్షలను ఉచితంగా అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

స్క్రీనింగ్ ద్వారా ప్రతి వ్యక్తి ఆరోగ్య ప్రొఫైల్‌ను రూపొందించి, డిజిటల్ వేదిక "సంజీవి" ద్వారా పరీక్షలు,వైద్య సేవలు,ఫాలోఅప్‌ను మరింత సమర్థ వంతంగా అనుసంధానించనున్నట్లు తెలిపారు. యోగా, సమతుల్య ఆహారం,సరైన జీవనశైలి, చక్కెర--ఉప్పు--నూనె వినియోగాన్ని నియం త్రించడం వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ స్టేక్‌హోల్డర్ సంప్రదింపుల ద్వారా వచ్చిన సూచనలను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత శాఖలు, నిపుణులు,భాగస్వాములతో కలిసి సమర్థవంతమైన కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ

- బాలల భవిష్యత్ విద్యకు పునాది బలోపేతమే లక్ష్యం
- మూడు రోజుల శిక్షణలో 205 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు
- ప్రీ-స్కూల్ విద్య, ఎఫ్ఎల్ఎన్, జాతీయ విద్యా విధానం--2020పై అవగాహన
- శిక్షణా కార్యక్రమాన్ని పర్యవేక్షించిన సీడీపీవో కె. ఉమామహేశ్వరి




**నాయుడుపేట - సూర్య వాస్తవం:** నాయుడుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఆగస్టు 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన ఈ శిక్షణలో మొత్తం 205 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అంగన్‌వాడీ స్థాయి నుంచే చిన్నారుల్లో పునాది అభ్యసన నైపుణ్యాలను పెంపొందించి, వారిని భవిష్యత్ విద్యకు సంసిద్ధులను చేయడమే శిక్షణ ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు తెలిపారు. జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని పెళ్లకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక బ్యాచ్, నాయుడుపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు బ్యాచ్‌లుగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఆయా కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు అంశాల వారీగా శిక్షణ అందించారు.

### ప్రీ-స్కూల్ విద్యపై ప్రత్యేక దృష్టిబిచిన్నారుల్లో సమగ్ర వికాసానికి శిక్షణ

శిక్షణలో ప్రధానంగా ప్రీ-స్కూల్ విద్య, జాతీయ విద్యా విధానం--2020, నవచేతన కార్యక్రమం, ఆధారశిల సిలబస్, నిపుణ్ భారత్ లక్ష్యాలు, పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చిన్నారుల వయస్సుకు అనుగుణంగా ఆటపాటలు, కథలు, పాటలు, వివిధ కార్యకలాపాల ద్వారా అభ్యసనాన్ని అందించే విధానాలను కార్యకర్తలకు వివరించారు. పిల్లల్లో భాషా నైపుణ్యాలు, జ్ఞాన వికాసం, సంఖ్యా పరిజ్ఞానం, సామాజిక--భావోద్వేగ అభివృద్ధి, సృజనాత్మకత, పాఠశాల సంసిద్ధత వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన ప్రారంభ బాల్య విద్య అందించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను కార్యకలాపాల ద్వారా వివరించారు.

### నిపుణుల ఆధ్వర్యంలో ప్రాక్టికల్ శిక్షణ

పాఠశాల విద్యాశాఖకు చెందిన మూడు మండలాల నుంచి 9 మంది డీఆర్‌పీలు (జిల్లా వనరుల వ్యక్తులు), ఐసీడీఎస్‌కు చెందిన 4 మంది సూపర్‌వైజర్లు శిక్షకులుగా వ్యవహరించారు. తరగతి గది ఆధారిత బోధనతో పాటు వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆచరణాత్మక అవగాహన కల్పించారు. నాయుడుపేట సీడీపీవో కె. ఉమామహేశ్వరి కీలక వనరుల వ్యక్తిగా శిక్షణా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పెళ్లకూరు, నాయుడుపేటలోని శిక్షణా కేంద్రాలను సందర్శించి తరగతి గదుల్లో జరుగుతున్న శిక్షణను పరిశీలించారు. శిక్షణ లక్ష్యాలు సమర్థవంతంగా అమలవుతున్న తీరును సమీక్షించి, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

### పునాది నుంచే నాణ్యమైన విద్య

నిపుణ్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా చిన్నారుల్లో పునాది అభ్యసన నైపుణ్యాలను అంగన్‌వాడీ స్థాయి నుంచే బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సీడీపీవో తెలిపారు. ప్రారంభ దశలో పిల్లలకు సరైన అభ్యసన వాతావరణం కల్పించడం ద్వారా వారు పాఠశాల విద్యలో మెరుగైన ప్రగతి సాధించేలా చేయవచ్చన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో సమర్థవంతంగా అమలు చేసి చిన్నారుల సమగ్ర వికాసానికి కృషి చేయాలని సూచించారు. చిన్నారుల తొలి విద్యా దశ అత్యంత కీలకమైనదని, ఈ దశలోనే భాష, సంఖ్యా పరిజ్ఞానం, ఆలోచనా శక్తి, సామాజిక నైపుణ్యాలకు బలమైన పునాది ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాలను మరింత పెంపొందించి, చిన్నారులకు నాణ్యమైన ప్రారంభ విద్య అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## కర్తవ్యమే ధ్యేయంగా.. తుదిశ్వాస వరకు నిజాయితీగా ఉన్న తహసీల్దార్ కార్యాలయ ఆర్ఐ సంతోష్ బాయి మృతి

**- విధి నిర్వహణలో నిబద్ధతతో సేవలందించిన రెవెన్యూ ఉద్యోగిని**

**- అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస**



**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సంతోష్ బాయి అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల రెవెన్యూ శాఖ ఉద్యోగులు, సహచరులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

### నిజాయితీతో విధులు.. నిబద్ధతతో సేవలు

సంతోష్ బాయి తన ఉద్యోగ జీవితంలో విధి నిర్వహణకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారని సహచరులు తెలిపారు. ఎవరి వద్దా లంచం కోసం చేయి చాపకుండా, తనకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా, నిబద్ధతతో నిర్వర్తించేందుకు ఆమె ఎల్లప్పుడూ కృషి చేసేవారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పట్ల బాధ్యతగా స్పందిస్తూ, నిబంధనల ప్రకారం తన విధులను నిర్వర్తించేవారని గుర్తుచేసుకున్నారు.

### సహచరుల మదిలో చెరగని ముద్ర

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన సంతోష్ బాయి తన సహచరులతో స్నేహపూర్వకంగా మెలిగేవారని, అందరితో కలుపుగోలుగా ఉండేవారని పలువురు తెలిపారు. ఆమె ఆకస్మిక మృతి పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిని తీవ్ర విషాదానికి గురిచేసింది.

### రెవెన్యూ శాఖకు తీరని లోటు

నిజాయితీగా, నిబద్ధతతో విధులు నిర్వహించిన సంతోష్ బాయి ఇక లేరనే వార్తతో కార్యాలయంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆమె సేవలను స్మరించుకుంటూ సహచరులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# నన్ను ఆమెతో పోల్చడం బాధ్యతను పెంచింది: కామాక్షి భాస్కర్ల



కంటెంట్ ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి కామాక్షి భాస్కర్ల. 'పొలిమేర' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఆమె, తాజాగా 'అగధ' అనే మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రముఖ దర్శకుడు ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన ఈ చిత్రం రేపు (ఆగస్ట్ 14) విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కామాక్షి మీడియాతో ముచ్చటించి సినిమా విశేషాలను, తన వ్యక్తిగత ప్రయాణాన్ని పంచుకున్నారు. ఈ సినిమాలోని 'మహాదేవి' పాత్ర కోసం తాను బౌద్ధ మతానికి సంబంధించిన పుస్తకాలు చదవడమే కాకుండా, బ్లాక్ మ్యాజిక్ గురించి కూడా తెలుసుకున్నానని ఆమె చెప్పిన విషయాలు ఆసక్తికరంగా మారాయి. మహాదేవి పాత్ర కోసం సిద్ధమవ్వడం ఒక పెద్ద సవాల్ అని కామాక్షి తెలిపారు. "ఆ పాత్ర కోసం నేను కామాక్షిని పూర్తిగా పక్కన పెట్టాల్సి వచ్చింది. నా సొంత వ్యక్తిత్వాన్ని, సిద్ధాంతాలను వదిలి ఆ పాత్రలోకి మారడానికి కాస్త ఇబ్బంది పడ్డాను. ప్రతి ముద్ర, ఆ పాత్ర నడవడిక గురించి లోతుగా అర్థం చేసుకుని నటించాను. సినిమాలో ఎక్కడా కామాక్షి కనిపించకూడదని జాగ్రత్త పడ్డాను" అని ఆమె వివరించారు. తన అభిమాన దర్శకుడు ఎం.ఎస్. రాజు నుంచి ఫోన్ రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని, ఆయన తీసిన 'మనసంతా నువ్వే' తన ఆల్ టైం ఫేవరేట్ అని తెలిపారు. సీనియర్ నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి తనను అనుష్కతో పోల్చడంపై స్పందిస్తూ, "అంత పెద్ద నిర్మాత అలా అనడం ఆనందంగా ఉంది. ఆయన అనుష్క గారితో పోల్చడం నా బాధ్యతను మరింత పెంచింది" అని నవ్వుతూ చెప్పారు. తన తొమ్మిదేళ్ల సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ కామాక్షి భావోద్వేగానికి గురయ్యారు. "మగవాళ్లు చేస్తే మేల్ సెంట్రిక్ అనరు, కానీ మహిళలు చేస్తే ఫిమేల్ సెంట్రిక్ అంటారు. నేను సినిమాల కోసం ఎంతో కష్టపడ్డాను. ఇప్పటికీ నాకు కారు లేదు, బైక్ మీదే వస్తాను. ప్రొడక్షన్ వాళ్లు ఇచ్చే వాహనం కూడా నాకు కొత్తగా అనిపిస్తుంది. మాది మధ్యతరగతి కుటుంబం కావడంతో కారు మాకు పెద్ద విషయం" అని ఆమె తన సాధారణ జీవనశైలి గురించి పంచుకున్నారు. తన కెరీర్‌లో ఎదురైన కొన్ని చేదు అనుభవాలను కూడా ఆమె గుర్తుచేసుకున్నారు. "'సత్యం రాజేష్ పక్కన చేసిందా? అయితే వద్దు' అని నా ముందే చాలా మంది అన్నారు. ఎవరి పక్కన నటిస్తున్నామనేది చూడటం చాలా తప్పు" అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్లామర్ పాత్రల కన్నా మన ఇంట్లోని మహిళలను ప్రతిబింబించే సాధారణ పాత్రలు చేయడానికే తాను ఇష్టపడతానని స్పష్టం చేశారు. "ఓ తెలుగమ్మాయిగా మన తెలుగు అమ్మాయిల పాత్రల్ని నేను తెరపై చూపించకపోతే ఇంకెవరు చేస్తారు" అని ఆమె ప్రశ్నించారు. కేవలం థ్రిల్లర్ చిత్రాలకే పరిమితం కాకుండా, త్వరలో ఓ ప్రేమకథా చిత్రంలో కూడా నటించనున్నట్లు వెల్లడించారు. నటనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు డాక్టర్ వృత్తికి తాత్కాలికంగా విరామం ఇచ్చానని, భవిష్యత్తులో దర్శకత్వం చేయాలనే ఆలోచన కూడా ఉందని తెలిపారు. "'అగధ' చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. ముఖ్యంగా ఎం.ఎస్. రాజు గారి కంబ్యాక్ కోసం అయినా ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని కామాక్షి తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



## ఈ అనుకోని విరామంతో భయంగా ఉంది: రష్మిక మందన్న

- తుంటి ఎముక గాయంతో విశ్రాంతి తీసుకుంటున్న నటి రష్మిక
- ఒకప్పుడు ఆగకుండా పనిచేయడం ఇష్టం, ఇప్పుడు ఆ ఆలోచనే భయమేస్తోందన్న నటి

ప్రముఖ నటి రష్మిక మందన్న ఇటీవల తుంటి గాయానికి గురై ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ ఊహించని విరామం వృత్తిపరమైన పని, వ్యక్తిగత జీవితంపై తన దృక్పథాన్ని ఎలా మార్చిందో ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఒకప్పుడు విరామం లేకుండా నిరంతరం పనిచేయడాన్ని ఇష్టపడిన తనకు, ప్రస్తుతం ఆ ఆలోచనే ఆందోళన కలిగిస్తోందని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో రష్మిక ఒక ఆసక్తికర పోస్ట్‌ను పంచుకున్నారు. "క్షణం తీరిక లేకుండా నిరంతరం పనిచేస్తున్నప్పుడు, అకస్మాత్తుగా వేగాన్ని తగ్గించడం భయంగా అనిపిస్తుంది. కానీ, అనుకోని పరిస్థితుల వల్ల నెమ్మదించాల్సి వచ్చినప్పుడు, గతంలో చేసిన ఆ తీవ్రమైన శ్రమ (హస్లింగ్) ఇప్పుడు భయాన్ని కలిగిస్తోంది. బహుశా ఇదే జీవితం కావచ్చు" అని రష్మిక రాసుకొచ్చారు. తన కుటుంబ సభ్యులతో గడుపుతున్న కొన్ని ఫోటోలను కూడా ఆమె షేర్ చేశారు. తాను ప్రస్తుతం ప్రేమ, సానుకూలత, ప్రార్థనల మధ్య ఉన్నానని చెబుతూ, అభిమానుల ఆదరాభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఆరోగ్య పరిస్థితి గురించి కొద్ది రోజుల క్రితమే స్పందించిన రష్మిక, ప్రస్తుతం తగినంత విశ్రాంతి తీసుకోవడం, పుస్తకాలు చదవడం, పజిల్స్ ఆడటం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడమే తన దినచర్యగా మారిందని తెలిపారు. అలారం అవసరం లేకుండా నిద్రలేవడం తన శరీరానికి ఎంతో మేలు చేస్తోందని, అప్పుడప్పుడు పని వేగాన్ని తగ్గించడం అంత చెడ్డదేమీ కాదని తాను గ్రహించినట్లు ఆమె పేర్కొన్నారు. 'పుష్ప', 'యానిమల్' చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రష్మిక, తన తదుపరి చిత్రం 'మైసా' షూటింగ్ సమయంలో గాయపడ్డారు.

## ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన జూనియర్ ఎన్టీఆర్



ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆయన భుజానికి బుధవారం వైద్యులు విజయవంతంగా ఆర్థ్రోస్కోపిక్ శస్త్రచికిత్స నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన, గురువారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే వైద్యుల పర్యవేక్షణలో ఫిజియోథెరపీ (రిహాబిలిటేషన్) ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. "డ్రాగన్" సినిమా చిత్రీకరణలో భాగంగా జూలై 27న ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆయన వేగంగా, సంపూర్ణంగా కోలుకోవాలంటే శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో, ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ ఆర్.ఏ. పూర్ణచంద్ర తేజస్వి, డాక్టర్ నితిన్ బెజ్జంకి నేతృత్వంలోని వైద్య బృందం ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసింది. ఎన్టీఆర్ పూర్తిస్థాయిలో కోలుకోవడానికి సుమారు రెండు నుంచి మూడు నెలల సమయం పట్టవచ్చని వైద్యులు అంచనా వేస్తున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, "సర్జరీ విజయ వంతంగా పూర్తయింది. నేను ప్రస్తుతం క్షేమంగా ఉన్నాను. కిమ్స్ వైద్య బృందానికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. నాకు అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు ధన్య వాదాలు. మీ మద్దతే నా బలం. త్వరలోనే మళ్ళీ కలుద్దాం" అని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కు గాయం కావడంతో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'డ్రాగన్' చిత్ర శ్రీలంక షెడ్యూల్ వాయిదా పడింది. ఈ సినిమాలో రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుండగా, అనిల్ కపూర్, బిజూ మీనన్, అశుతోష్ రాణా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.



# భారత్-ఆఫ్ఘన్ టీ20 సిరీస్.. సోనీకి టీవీ ప్రసార హక్కులు



భారత క్రికెట్ అభిమానులకు ఒక ముఖ్యమైన అప్‌డేట్. టీమిండియా, ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ టెలివిజన్ ప్రసార హక్కులను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ కైవసం చేసుకుంది. ఈ సిరీస్ గ్లోబల్ హక్కులను కలిగి ఉన్న ఐటీడబ్ల్యూ యూనివర్స్ సంస్థ, పలు బ్రాడ్‌కాస్టర్లతో చర్చల అనంతరం టీవీ హక్కులను సోనీకి కేటాయించింది. అయితే, డిజిటల్ ప్రసార హక్కులు మాత్రం ఫ్యాన్‌కోడ్ వద్దే ఉంటాయని స్పష్టం చేసింది. బీసీసీఐ ఆమోదం పొందిన షెడ్యూల్ ప్రకారం, ఈ సిరీస్‌ను 2026 సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్వహించాల్సి ఉంది. ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) ఈ సిరీస్‌కు ఆతిథ్యం ఇస్తోంది. ఇదిలా ఉండగా, ఈ సిరీస్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేయాలని ఐటీడబ్ల్యూ యూనివర్స్ వ్యవస్థాపకుడు భైరవ్ శాంత్, ఏసీబీ సీఈఓ నసీబ్ ఖాన్‌కు లేఖ రాశారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి పండుగ ఉన్నందున, ఆ రోజు ఒక మ్యాచ్‌ను నిర్వహించేలా షెడ్యూల్ సవరించాలని కోరారు. ఇందుకుగాను సెప్టెంబర్ 13, 14, 16 (లేదా 17) తేదీల్లో మ్యాచ్‌లు జరపాలని ఒక ప్రత్యామ్నాయాన్ని సూచించారు. భారత్‌లో వినాయక చవితికి ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పు చేయాలని, ఇది భారత అభిమానుల పట్ల సద్భావనకు, బీసీసీఐ-ఏసీబీ సంబంధాల బలోపేతానికి దోహదపడుతుందని శాంత్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తిపై ఏసీబీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.



## టెస్టుల్లో మిచెల్ స్టార్క్ ప్రపంచ రికార్డు..

- అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా చరిత్ర

ఆస్ట్రేలియా వెటరన్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన ఎడమచేతి వాటం బౌలర్‌గా చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో శ్రీలంక దిగ్గజ స్పిన్నర్ రంగనా హెరాత్ (433) రికార్డును అధిగమించాడు. బంగ్లాదేశ్‌తో డార్విన్‌లోని మరారా క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న తొలి టెస్టులో ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఓపెనర్ షాద్మాన్ ఇస్లామ్‌ను ఔట్ చేయడం ద్వారా స్టార్క్ తన టెస్టు వికెట్ల సంఖ్యను 434కి పెంచుకున్నాడు. తన 106వ టెస్టులో ఈ మైలురాయిని చేరుకున్న స్టార్క్, భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ (434 వికెట్లు) రికార్డును సమం చేశాడు. ప్రస్తుతం టెస్టుల్లో ఆల్-టైమ్ వికెట్ టేకర్ల జాబితాలో 10వ స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా పేస్ దిగ్గజం డేల్ స్టెయిన్ (439) రికార్డును బద్దలు కొట్టడానికి స్టార్క్ కేవలం ఆరు వికెట్ల దూరంలో ఉన్నాడు. ఈ రికార్డుతో ఎడమచేతి వాటం బౌలర్ల జాబితాలో స్టార్క్ అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. రంగనా హెరాత్ (433), పాకిస్థాన్ గ్రేట్ వసీం అక్రమ్ (414), న్యూజిలాండ్ స్పిన్నర్ డానియల్ వెటోరి (362), శ్రీలంక పేసర్ చమిందా వాస్ (355) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 348 వికెట్లతో ఈ జాబితాలో ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. అయితే, వ్యక్తిగత రికార్డులపై తాను పెద్దగా దృష్టి పెట్టనని, జట్టు ప్రయోజనాలే ముఖ్యమని ఈ సిరీస్‌కు ముందు స్టార్క్ పేర్కొన్నాడు. ఐసీసీ కథనం ప్రకారం.. "ఇలాంటి దిగ్గజాల సరసన నా పేరు వినిపించడం గౌరవంగా ఉంది. కానీ, ఆడుతున్నప్పుడు ఈ గణాంకాలకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు" అని స్టార్క్ తెలిపాడు. కాగా, స్టార్క్ ఈ చారిత్రక ఘనత సాధించిన రోజే ఆస్ట్రేలియా జట్టు బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్, బంగ్లాదేశ్ బౌలర్ల ధాటికి కేవలం 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బౌలర్ హసన్ మహమూద్ 55 పరుగులిచ్చి 6 వికెట్లతో కెరీర్ బెస్ట్ ప్రదర్శన చేశాడు. ఆసీస్ తరఫున స్టీవ్ స్మిత్ (71) ఒక్కడే పోరాడాడు.

## ఈసారి ఆసియా క్రీడల్లో భారత్-పాక్ మ్యాచ్ జరగాలంటే.. ఇదే ఏకైక మార్గం!



జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరగనున్న ఆసియా క్రీడలు 2026లో భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు మరోసారి సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాయి. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఈ మెగా ఈవెంట్ జరగనుంది. గతంలో హాంగ్జౌలో జరిగిన క్రీడల్లో రెండు విభాగాల్లోనూ స్వర్ణ పతకాలు గెలుచుకున్న భారత జట్లు, ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగుతున్నాయి. ఈ టోర్నీలో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే భారత్-పాకిస్థాన్ మ్యాచ్ జరగాలంటే కేవలం రెండు అవకాశాలు మాత్రమే ఉన్నాయి. ఈ చిరకాల ప్రత్యర్థులు స్వర్ణ పతకం కోసం ఫైనల్లో తలపడాలి లేదా కాంస్య పతకం కోసం జరిగే ప్లే-ఆఫ్ మ్యాచ్‌లో అయినా పోటీపడాలి. అంటే.. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ జరగాలంటే ఇరు జట్లు సెమీఫైనల్స్ గెలిచి ఫైనల్ చేరడమో లేదా సెమీస్‌లో ఓడిపోవడమో జరగాలి. అన్ని మ్యాచ్‌లు పూర్తి అంతర్జాతీయ హోదాతో టీ20 ఫార్మాట్‌లో జరగనున్నాయి. పురుషుల విభాగంలో టాప్ సీడ్ జట్లుగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. మిగిలిన నాలుగు స్థానాల కోసం ఇతర జట్లు గ్రూప్ దశలో పోటీపడతాయి. భారత పురుషుల జట్టుకు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా, యువ ఆటగాడు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి కూడా 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కింది. మహిళల విభాగంలో సెప్టెంబర్ 17 నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. క్వార్టర్ ఫైనల్‌లో భారత జట్టు జపాన్‌తో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే బంగ్లాదేశ్ లేదా చైనా జట్టుతో సెమీఫైనల్‌లో ఆడుతుంది. మరో క్వార్టర్‌లో పాకిస్థాన్ జట్టు థాయ్‌లాండ్‌తో తలపడనుంది. మహిళల జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా కొన సాగనున్నారు. మొత్తం మీద రెండు విభాగాల్లోనూ పటిష్ఠమైన జట్లతో బరిలోకి దిగుతున్న భారత్, మరోసారి పసిడి పతకాలే లక్ష్యంగా ప్రయాణం మొదలుపెట్టనుంది.

# ఆసుపత్రి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి

## - ఎంపీపీ వీరనారాయణరెడ్డి



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ లో ఎంపీపీ అధ్యక్షతన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్య, సిబ్బంది నిర్లక్ష్యానికి తావులేకుండా తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిం చాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై ఉన్నతాది కారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వారితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు.తాను మరో ఒకటిన్నర నెల మాత్రమే ఎంపీపీగా కొనసాగుతానని, అనంతరం మాజీ ఎంపీపీ హోదాలోనూ ఆసుపత్రికి వచ్చి పనితీరును పరిశీలిస్తానని అన్నారు. ఇది మన ఊరి ఆసుపత్రి అని, స్థానిక ప్రజలకు అనారోగ్యం కలిగినప్పుడు మెరుగైన వైద్య సేవలు అందేలా చేయడమే తన ధ్యేయమని తెలిపారు. మన ప్రాంతానికి చెందిన ఆసుపత్రిని మనమందరం కలిసి అభివృద్ధి చేసుకోవాలని కోరారు.అనంతరం ఎంపీపీ ఆసుపత్రిలోని బాత్రూమ్‌లు, పరిసరాలు, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు.

ఇదే విధంగా పరిశుభ్రత, సేవల ప్రమాణాలను కొన సాగించాలని సిబ్బందికి సూచించారు.పీహెచ్‌సీలో రోగుల తాగునీటి అవసరాల కోసం కూల్ వాటర్ మినరల్ ప్లాంట్‌ను ఉచితంగా ఏర్పాటు చేసేందుకు స్థానిక గ్రామానికి చెందిన ఆవుల దస్తగిరి నాయుడు ముందుకు రావడం అభినందనీయమని ఎంపీపీ అన్నారు.బద్వేల్ డివిజనల్ డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేష్ మాట్లాడుతూ.. ఎంపీపీ సూచించిన విధంగా వారం రోజుల్లో పీహెచ్‌సీలో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో స్థానిక వైద్యులు సంపత్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ మాధవ నాయుడు ,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణమాసంలో శ్రీ వీరబ్రహ్మ పురాణ ప్రవచనాలు



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠంలో శ్రావణమాసం సందర్భంగా శ్రీ వీరబ్రహ్మ పురాణం ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంమఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి వారి ఆదేశానుసారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శ్రావణమాసం మొత్తం ప్రతిరోజూ శ్రీ వీరబ్రహ్మ పురాణంలోని ఆధ్యాత్మిక విశేషాలను భక్తులకు వివరించనున్నారు.ఈ సందర్భంగా మఠాధిపతులు మాట్లాడుతూ, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి తత్త్వబోధనలు, ఆధ్యాత్మిక సందేశాలను భక్తులకు చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భక్తులు, పుర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.శ్రావణమాసం మొత్తం జరిగే ఈ ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమానికి భక్తులు, పుర ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ప్రవచనాలను నిర్వహించే రామిరెడ్డి, నారాయణస్వామిలను. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో మఠాధిపతి సోదరుడు శ్రీ దత్తాత్రేయ స్వామి శ్రీ దత్తాత్రేయ స్వామి వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రవచన కర్తలు చెన్నారెడ్డి, సుబ్బారెడ్డి , భక్తులు మఠం సిబ్బంది ఉన్నారు.

# అవయవదానం చేయండి మరో జీవితానికి ఆసరా ఇవ్వండి

## - కొవ్వూరు రమేష్‌రెడ్డి




**ప్రొద్దుటూరు-సూర్య వాస్తవం:** అవయవదానం చేసి మరొకరికి కొత్త జీవితాన్ని అందించాలని ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డు నుంచి శివాలయం సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ర్యాలీని ప్రారంభించిన ఈ ర్యాలీలో ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల, సీబీఐటీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అవయవదానంపై ఉన్న అపోహలను తొలగించి, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ దాతగా ప్రతిజ్ఞ చేయాలని రమేష్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఆసం రఘు రామిరెడ్డి, ఘంటసాల వెంకటేశ్వర్లు, ఈవీ సుధాకర్‌రెడ్డి, రోటరీ కార్యదర్శి శ్రీధరశర్మ, రొటేరియన్లు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, సాధు గోపాలకృష్ణ, రామకృష్ణ, ఆయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల కోసం రాతపరీక్ష




**ప్రొద్దుటూరు-సూర్య వాస్తవం:** ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టీసీఎస్ లో ఉద్యోగాల కోసం పూల్ డ్రైవ్ నిర్వహించింది. అందులో భాగంగా ఆ సంస్థ డిగ్రీ విద్యార్థులకు గురువారం స్థానిక వేదవ్యాస డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించింది. ప్రొద్దుటూరులో అన్ని డిగ్రీ కళాశాలల నుంచి మొత్తం 200 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. అందులో అర్హత సాధించిన విద్యార్థులకు వారంలో ముఖాముఖీలు నిర్వహించనున్నారు. అనంతరం టీసీఎస్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారు. ఈ సందర్భంగా వేదవ్యాస డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎల్. నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ అవకశాలు కల్పించేందుకు టీసీఎస్ సంస్థ విద్యార్థులకు రాత పరీక్ష జరపడం సంతోషంగా ఉందని చెప్పారు. విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన టీసీఎస్ ప్రతినిధులు రవితేజ, ప్రియాంక, శ్రావణి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రవి, కళాశాల అధ్యాపకులు అభినందించారు.



# గాలివీడులో కిసాన్ మేళ--ఉత్తమ రైతులకు సన్మానం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- ఆయనతో పాటు పాల్గొన్న లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ డా. షఫీ నాయక్



**లక్కిరెడ్డిపల్లి/ గాలివీడు -సూర్య వాస్తవం :**గాలివీడు మండల కేంద్రంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధ్యక్షతన అత్యంత ఘనంగా నిర్వహించిన కిసాన్ మేళ 2026 కార్యక్రమానికి లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్.ఎండి. షఫీ నాయక్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికతలు, ప్రకృతి వ్యవసాయ విధానాల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులకు స్వస్తి పలికి, ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. లక్కిరెడ్డిపల్లి మండలం గాండ్ల పల్లెకు చెందిన రైతు నాగేంద్ర ను మొమెంటో, దుశ్యాలువాతో మంత్రి మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ షఫినాయక్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఆర్థికంగా బలపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో అంతా అపరిశుభ్రతే

- "గురుకులమా.. నరక కూపమా" అంటున్న అధికారులు
- ఆకస్మిక తనిఖీలో బయటపడ్డ పాఠశాల బండారం





**బ్రహ్మంగారిమఠం -సూర్య వాస్తవం :** కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అపరిశుభ్రత రాజ్య మేలుతోంది. విద్యార్థుల ఆరోగ్యాన్ని పట్టించుకునే నాథుడే లేకపోవడంతో పాఠశాల డైనింగ్ హాలు ఈగలతో నిండిపోయింది.గురువారం మధ్యాహ్నం 12:30 గంటలకు మండల ఎంపీపీ వీరనారాయణరెడ్డి, బద్వేల్ డివిజనల్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. మల్లేష్, బి.మఠం ఎంపీడీవో రామచంద్రారెడ్డి కలిసి పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు.అధికారులు తనిఖీ చేసే సమయానికి విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. కానీ డైనింగ్ హాలులో పరిశుభ్రత అస్సలు లేదు. తినే ఆహారం చుట్టూ ఈగలు ముసురుతున్నాయి. పశువుల పాకను తలపించేలా దుర్వాసన, ఈగల మోతతో వాతావరణం కంపు కొడుతోంది. ఈ దృశ్యాన్ని చూసి అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది గురుకులమా లేక నరక కూపమా?" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రిన్సిపాల్ పరమేశ్వరుడు మరియు సంబంధిత సిబ్బందిని పిలిచి ఎంపీపీ వీరనారాయణరెడ్డి తీవ్రంగా మందలించారు. పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచనలు చేశారు.అనంతరం ఎంపీపీ సంబంధిత జిల్లా అధికారికి ఫోన్ చేసి పాఠశాలలోని దుస్థితిని వివరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.కోట్లు ఖర్చు పెట్టి కట్టిన భవనంలో విద్యార్థుల ఆరోగ్యం గాలికి వదిలేయడంపై తల్లిదండ్రులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# కుటుంబ కలహాలతో జడ్పీఎన్ఎఫ్ ఉద్యోగి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నం





ఫైల్ ఫోటో

**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం:** మండలంలోని బీ యర్రగుడి గ్రామం బిఏ నాగిరెడ్డి పల్లెకు చెందిన హరి కృష్ణ అనే వ్యక్తి కుటుంబ కలహాలతో గురువారం రాత్రి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల వివరాల మేరకు రాయచోటి వేంపల్లి మార్గమధ్యంలోని దాసిరెడ్డి మిట్ట సమీపంలో బిఏ నాగిరెడ్డిపల్లికి చెందిన జడ్పీఎన్ఎఫ్ ఉద్యోగి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని కాలిపోతున్న తరుణంలో అటువైపు వెళుతున్న వాహన దారులు, స్థానికులు గమనించి 108కు సమాచారం అందించి హుటా హుటిన రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. హరికృష్ణ రామాపురం మండలం కల్పనాయన చెరువు పరిధిలో జడ్పీఎన్ఎఫ్ ఎఫ్ఎంటిగా పనిచేస్తున్నట్లు తెలిపారు.ఈ మేరకు మెరుగైన వైద్యం కొరకు కడప రిమ్స్ కు తరలించినట్లు అక్కడ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లె పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

# ట్రాఫిక్ పై అవగాహన

## - ట్రాఫిక్ సిఐ చాంద్ బాషా



**రాయచోటి-సూర్య వాస్తవం:** ద్విచక్ర వాహనదారులు, వాహన చోదకులు, రైడర్లకు హెల్మెట్ ప్రాముఖ్యత గురించి, మైనర్ డ్రైవింగ్ చేయవద్దని, బీమా అన్ని వాహనాలకు తప్పనిసరి చేసు కోవాలని, బహిరంగ ప్రదేశాల్లో ర్యాష్ మరియు నిర్లక్ష్యం చేయవద్దని, ట్రిపుల్ చేయవద్దని, మొబైల్ డ్రైవింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేయవద్దని ట్రాఫిక్ ఎస్ఐ చాంద్ బాషా అన్నారు. బుధవారం ద్విచక్ర వాహన దారులు, వాహన చోదకులు కు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# మహేశ్వర్ రెడ్డి పుట్టినరోజు భారీ రక్తదాన శిబిరం








**చిట్వేలి -సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా చిట్వేలి మండలం మండల కేంద్రంలో వాట్సప్ గ్రూపులలో యువత హడావుడి అంతా ఇంతా కాదు. తమ అభిమాన నాయకుడు పుట్టినరోజు ఆయన గురించి ఆయన గొప్పతనం గురించి ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఉంటే ఇది కదా ఒక మనిషికి కావలసింది. రాజకీ యాలలో వస్తే శత్రువులు ఎక్కువ మంది తయారవుతారు అంటారు కానీ అందుకు పూర్తి విరుద్ధం చిట్వేలి మండలంలోని చిట్వేల్ ఉప మాజీ ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి నిదర్శనం. చిట్వేలి మండల ప్రజలకు ఎప్పుడు మంచి చేయాలనే తపన ఆయనకు నిండుగా ఉంటుంది ఎవరు ఆయన దగ్గరికి వెళ్లిన ఆయనతో మాట్లాడిన తర్వాత తమ సమస్య తీరిపోతుంది లే అనే భావన ఏర్పడుతుంది అంతటి మనోధైర్యాన్ని అందించేటువంటి వ్యక్తి పోలీస్ స్టేషన్ సమస్య ఉన్న వ్యక్తిగత సమస్య ఉన్న తమ సమస్యలు చెప్పుకోవాలి అని ప్రజలకు కచ్చితంగా అనిపిస్తుంది అంటే అది మహేశ్వర్ రెడ్డి మాత్రమే . యువత ఆయన పుట్టినరోజు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 112 మంది రక్తదానం చేశారు .మొదటిసారిగా చిట్వేలి మండలంలోని యువత తీసుకున్న నిర్ణయం . మహేశ్వర్ రెడ్డి అన్నకు శుభాకాంక్షలు చెప్పడానికి కుల మతాలకు అతీతంగా రాజకీయాలకు మహేష్ రఘురాం రెడ్డి గార్డెన్స్ కళకళలాడిపోయింది ఈ కార్యక్రమంలో చిట్వేలి మండలం వైసీపీ కన్వీనర్ చెవ్వు చెవ్వు శ్రీనివాస్ రెడ్డి వైసీపీ మండల సీనియర్ నాయకులు ఎల్వి మోహన్ రెడ్డి చిట్వేలి మండలం టౌన్ వైసీపీ ప్రెసిడెంట్ హజరత్ రెడ్డి వైసీపీ యువ నాయకుడు నవీన్ సుబ్రహ్మణ్యం రెడ్డి మాజీ సర్పంచులు ఎంపీటీసీలు భారీ సంఖ్యలో ప్రజలు యువత పాల్గొన్నారు.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# ఓటు తొలగింపుపై అధికారుల వివరణ అబద్ధం..

**- కొత్త వీడియోతో ముందుకొచ్చిన ప్రకాశ్ రాజ్**
**- బెంగళూరు ఓటర్ల జాబితాలో తన పేరు తొలగించారని ప్రకాశ్ రాజ్ ఆరోపణ**
**- తొలగించలేదు, చిరునామా మారారని మాత్రమే గుర్తించామన్న ఎన్నికల అధికారులు**
**- అధికారుల వివరణపై అసంతృప్తి.. అదంతా నాటకమని కొత్త వీడియో విడుదల**
**- సామాన్య పౌరుడి హక్కుల కోసమే ఈ పోరాటమంటున్న నటుడు**
**- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో రాజుకున్న వివాదం**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, కర్ణాటక ఎన్నికల అధికారుల మధ్య ఓటు హక్కు నమోదు విషయంలో మాటల యుద్ధం కొనసాగుతోంది. బెంగళూరు ఓటర్ల జాబితా నుంచి తన పేరును తొలగించారని ప్రకాశ్ రాజ్ ఆరోపించగా, అధికారులు దానిని ఖండించారు. తాజాగా, అధికారులు ఇచ్చిన వివరణపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం మరో వీడియోను విడుదల చేశారు. అధికారులది పచ్చి అబద్ధమని, నాటకమాడుతున్నారని ఆయన ఆరోపించారు. వివరాల్లోకి వెళితే.. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గ జాబితా నుంచి తన పేరును తొలగించారని ప్రకాశ్ రాజ్ ఇటీవల ఒక వీడియోలో ఆరోపించారు. తాను పుట్టి పెరిగిన, చదువుకున్న, 2019లో ఎంపీగా పోటీ చేసిన చోటే తన ఓటు గల్లంతు కావడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ప్రక్రియలో బెంగళూరులో సుమారు 65 లక్షల మంది ఓటర్లు ప్రభావితమయ్యారని కూడా ఆయన పేర్కొన్నారు.

ప్రకాశ్ రాజ్ ఆరోపణలపై బెంగళూరు నగర పాలక సంస్థ, ఎన్నికల అధికారులు స్పందించారు. ఆయన పేరును తొలగించలేదని, కేవలం "నివాసం మారారు" (ఌష్ట్రఱట్వఏ) అని మాత్రమే జాబితాలో గుర్తించామని స్పష్టం చేశారు. ఆయన నమోదు చేసుకున్న విఠల్ మాల్యా రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో దాదాపు నాలుగేళ్లుగా నివసించడం లేదని బూత్ స్థాయి అధికారి (దీూూ) విచారణలో తేలిందని తెలిపారు. చుట్టుపక్కల వారు, భవన యజమాని కూడా ఇదే విషయాన్ని ధృవీకరించారని, ఈ మేరకు తనిఖీ కూడా నిర్వహించామని వివరించారు. తాను వేరే చోట నివసిస్తున్నట్లు ప్రకాశ్ రాజ్ సైతం ఫోన్‌లో అంగీకరించారని అధికారులు తెలిపారు. ఫారం 6 ద్వారా కొత్త చిరునామాను నమోదు చేసుకోవాలని సూచించారు.

అయితే, అధికారుల వివరణను ప్రకాశ్ రాజ్ పూర్తిగా తోసిపుచ్చారు. తొలుత పొరపాటు జరిగిందని అంగీకరించి, సరిచేస్తామని చెప్పిన అధికారులే.. ఇప్పుడు మాట మార్చి నాటకాలాడుతున్నారని మండిపడ్డారు. వివాదం పెద్దది కావడంతోనే "శాశ్వతంగా మారారు" (జూవతీఝఱవఅత్‌శ్రీఎ ఌష్ట్రఱట్వఏ) అనే పదాన్ని "మారారు" (ఌష్ట్రఱట్వఏ) అని మార్చి, ప్రెస్ మీట్ పెట్టి, తన పాత చిరునామాలో నకిలీ తనిఖీ చేశారని ఆరోపించారు. ఇది తన ఒక్కడి సమస్య కాదని, పౌరుల హక్కుల కోసం తన పోరాటం కొనసాగుతుందని, మరిన్ని వివరాలతో మళ్లీ వస్తానని ఆయన స్పష్టం చేశారు.

# ఇవాళ జైలులో నన్ను కూడా అవమానించారు: జగన్

**- కర్నూలు జైలులో ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన జగన్**
**- చంద్రబాబు రెడ్ బుక్ పాలనతో ప్రతిపక్షాన్ని అణిచివేస్తున్నారని ఆరోపణ**
**- బాధితులే నిందితులుగా మారుతున్నారని, విరూపాక్షి ఘటనే ఉదాహరణ అన్న జగన్**
**- బీసీ, మైనారిటీ నేతలను లక్ష్యంగా చేసుకుని కేసులు పెడుతున్నారని విమర్శ**
**- తాను నాటిన తప్పుడు విత్తనాలే రేపు చంద్రబాబును చుట్టుకుంటాయని హెచ్చరిక**

అమరావతి- సూర్య వాస్తవం

రాష్ట్రంలో అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు ఘటనే నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్యే విరూపాక్షిని గురువారం ఆయన ములాఖత్‌లో భాగంగా కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాను ఇవాళ జైలుకు వస్తే తనను కూడా అవమానించే ప్రయత్నం చేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక మాజీ ముఖ్యమంత్రిగా వచ్చిన నన్ను లోపల కూర్చోబెట్టి ఫోటో తీయకుండా, గ్రిల్స్ బయట నిలబెట్టి ఫోటో తీశారు. ఇది చంద్రబాబు శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనం. మా హయాంలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లు తీసుకొస్తే, వీళ్లు అవమానించే సంస్కృతిని తెచ్చారు" అని అన్నారు.

ప్రభుత్వాలు శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "ఈరోజు మీరు ఏ తప్పుడు విత్తనాలు నాటుతున్నారో, అవే రేపు మహావృక్షాలై మిమ్మల్ని రెండింతలుగా చుట్టుకుంటాయి. ఈ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు" అని జగన్ హెచ్చరించారు. సమయం వేగంగా గడిచిపోతుందని, ఈ దుర్మార్గపు పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని ఆయన వ్యాఖ్యానించారు. "ఈ వెన్నుపోటు పార్టీ పాలనలో బాధితులే నిందితులుగా మారుతున్నారు. దాడికి గురైన వారిపైనే కేసులు పెడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. దీనికి విరూపాక్షి ఉదంతమే ప్రబల ఉదాహరణ" అని జగన్ పేర్కొన్నారు. ఆగస్టు 1న చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో తమ పార్టీ కార్యకర్త గిరి తనపై దాడి జరుగుతోందని, రక్షించమని రాత్రి 7:45 గంటలకు ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేసి, వీడియోలు పంపాడని జగన్ ఆధారాలను చూపుతూ వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక ఎస్సైకి 7:47 గంటలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదన్నారు. పైగా, కార్యకర్తను కాపాడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపై దాడి చేశారని, ఆయన తమ్ముడి చేయి విరగ్గొట్టారని ఆరోపించారు.

దాడికి గురైన విరూపాక్షి ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోగా, అర్ధరాత్రి 2:45 గంటలకు వందల మంది పోలీసులు దొంగల్లా ఆయన ఇంటిపై పడి, తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఒక ఉగ్రవాదిని పట్టుకున్నట్లు అరెస్టు చేశారని జగన్ మండిపడ్డారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి మొత్తం 38 మందిపై మూడు వేర్వేరు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో రెండుసార్లు చేర్చడం చూస్తే, కేసు ఎంత కట్టుకథో అర్థమవుతోందన్నారు. ఈ ప్రభుత్వం బీసీ, మైనారిటీ వర్గాల నాయకత్వాన్ని అణిచివేసేందుకు కుట్ర చేస్తోందని జగన్ ఆరోపించారు. మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడి బైక్ యాక్సిడెంట్‌ను హత్యాయత్నంగా చిత్రీకరించడం, మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై కిడ్నాప్ కేసు పెట్టడం, కారుమూరు సునీల్‌పై అక్రమ కేసులు బనాయించడం వంటివి ఇందులో భాగమేనని విమర్శించారు.

# రాష్ట్రంలోనూ బీజేపీ కుట్ర

సంస్థలెన్నిం టినీ ఉపయోగించినా... తెలంగాణ ప్రజలు ఆ పార్టీని ఇక్కడకు రానీయ్యబోరని తేల్చిచెప్పారు. ఎవరి వద్ద ప్రేమ ఉందో, ఎవరి వద్ద విషం చిమ్మే రాజకీయాలున్నాయో రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా తెలుసునని వ్యాఖ్యానించా రు. సర్ ప్రక్రియ ద్వారా రాష్ట్రంలో 60 లక్షల నుంచి 70 లక్షల ఓట్లను తొలగించారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న చిన్న తప్పులను కూడా కంప్యూటర్ ఆధారంగా చూపించి ఓటు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రయత్నాలను తాము తిప్పి కొడుతున్నామనీ, అయితే తమ శక్తి మాత్రమే సరిపోదని అన్నారు. రాష్ట్రంలో చదువుకున్న వారంతా రాబోయే 10 రోజులు ఓటర్ల హక్కులను కాపాడేందుకు ముందుకొచ్చి సహకరించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. గుజరాత్ నుంచి రాష్ట్రానికి అధికారం కోసం వచ్చే వారికి చోటు లేదని చాటిచెప్పాలంటూ కోరారు. అలాంటి విషం చిమ్మే రాజకీయాలకు చెక్ పెట్టాలన్నారు. ప్రతి ఇంటికీ తిరిగి ఓటర్ల వివరాలను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కునూ కాపాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని కొమురం భీం ఆదివాసీ భవన్ లో నిర్వహించిన 'మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు ఎలాంటి ఢోకా ఉండదని ఆయన భరోసానిచ్చారు. హిందువులు, ముస్లింలు తమ పార్టీకి రెండు కండ్లలాంటి వారని వ్యాఖ్యానించారు. హిందువులతో సమానంగా ముస్లింలకు అన్ని అవకాశాలు దక్కాల్సిందేనని చెప్పారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల కోసం నాలుగు శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇస్తే, వాటి రద్దు కోసం హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు వెళ్లారని గుర్తు చేశారు. ఇందుకోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు వ్యతిరేకించినవారు (బీజేపీ నేతలు) రాష్ట్రంలోనే కాదు గుజరాత్ లోనూ మైనారిటీ రిజర్వేషన్లను రద్దు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. మైనారిటీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పోరాడుతోందని హామీనిచ్చారు. తమ పార్టీ ఎల్లప్పుడూ సామాజిక న్యాయం కోసమే నిలబడిందని చెప్పారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం కూడా మైనారిటీలకు సమాన అవకాశాలు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు.

ప్రభుత్వ సంస్థల్లో మైనారిటీలకు తగిన ప్రాతినిథ్యం కల్పించామనీ, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో సైతం మైనారిటీ ప్రతినిధిని నియమించామని వివరించారు. ఫిరోజ్ ఖాన్, మహమ్మద్ అజహరుద్దీన్, షబ్బీర్ అలీలను ఎన్నికల్లో ప్రజలు గెలిపించకపోయినా, మంత్రిత్వ శాఖను వారి కోసం ఖాళీగా ఉంచి వారితోనే భర్తీ చేశామని సీఎం గుర్తుచేశారు. విద్యతో పాటు నైపుణ్యాలను సాధించటంపై దృష్టి సారించాలని సీఎం ఈ సందర్భంగా యువతకు పిలుపునిచ్చారు. సర్టిఫికెట్ల కన్నా పనితనానికి, నైపుణ్యానికే పట్టం కట్టే రోజులు వచ్చాయని తెలిపారు. యువతకు అవకాశాలు పెంచేందుకే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చామని చెప్పారు. చదువు తగ్గ ఉద్యోగాలు లభించినప్పుడే ఆ చదువుకు సార్థకత లభిస్తుందని చెప్పారు. ఆ భావనకు తగ్గట్టు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూనే, ప్రయివేటు ఉద్యోగాలకు పోటీ పడేలా నైపుణ్య శిక్షణను అందిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేశామని అన్నారు.

గ్రూప్ -1 నియామకాలను తాము చేపడుతుంటే అడ్డుకునేందుకు కొందరు కోర్టు కెళ్లారనీ, కోర్టులోనూ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించిందని తెలిపారు. రాజకీయ నాయకులు ఐదేండ్లకు ఒకసారి పరీక్ష రాయాలనీ, అయితే వారు పాస్ అవుతారో? లేదో? అని సీఎం వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లోకి కొత్తగా వచ్చిన వారు రాష్ట్రానికి దశాబ్దాల పాటు సేవలందించాల్సి ఉంటుందని తెలిపారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రైజింగ్ కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఐఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన వారితో పాటు తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీల్లో పదవ తరగతి, ఇంటర్ లో ర్యాంకులు సాధించిన వారిని సీఎం సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్, రాష్ట్ర సమాచార పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గేకు అవమానం..
## రాష్ట్రవ్యాప్త నిరసనలకు షర్మిల పిలుపు

**- ఖర్గే పర్యటించిన స్థలాన్ని శుద్ధి చేయడంపై షర్మిల తీవ్ర ఆగ్రహం**
**- ఇది దళితుల వ్యక్తిత్వానికి జరిగిన అవమానమంటూ విమర్శ**
**- బీజేపీ కుల వివక్షకు, విభజన రాజకీయాలకు నిదర్శనమని ఆరోపణ**
**- ఆగస్టు 14న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, సత్యాగ్రహానికి పిలుపు**

అమరావతి- సూర్య వాస్తవం

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అవమానం జరిగిందంటూ, బీజేపీపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని బీజేపీ, హిందుత్వ సంస్థలు గంగాజలంతో శుద్ధి చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బీజేపీ కుల దురహంకారానికి, దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆరోపిస్తూ నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. ఈ ఘటనపై షర్మిల తీవ్రంగా స్పందించారు. "బీజేపీ చేసిన హవనం.. దళితుల వ్యక్తిత్వానికి జరిగిన హననం" అని ఆమె అభివర్ణించారు. దళితుల పట్ల వివక్ష చూపడమే బీజేపీ సిద్ధాంతమని, కులమతాల మధ్య విభేదాలు సృష్టించడం ఆ పార్టీ మనస్తత్వమని విమర్శించారు. రామ్ లీలా మైదానంలో ఖర్గే అడుగుపెట్టిన స్థలాన్ని శుద్ధి చేయడం బీజేపీ పాటిస్తున్న అంటరానితనానికి, అసమానతలకు అద్దం పడుతుందని ఆమె మండిపడ్డారు. ఇది సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన చర్య అని, రాజ్యాంగ విలువలను తునాతునకలు చేసే ఈ రాక్షస చర్యను యావత్ దేశం ఖండిస్తోందని తెలిపారు.

ఈ సిగ్గుమాలిన చర్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఉద్యమిస్తోందని, అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు షర్మిల ప్రకటించారు. ఆగస్టు 14వ తేదీ సాయంత్రం ప్రతి జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో భారీ మార్చ్, సత్యాగ్రహం నిర్వహించాలని ఆమె పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఈ మార్చ్‌ను స్థానిక అంబేడ్కర్ లేదా గాంధీ విగ్రహాల వద్ద ముగించి, ఖర్గేకు సంఘీభావంగా సత్యాగ్రహం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు, పార్టీ అనుబంధ విభాగాలు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని షర్మిల కోరారు. ఇటువంటి వివక్ష, విభజన కుట్రలను దేశ ప్రజలు సహించబోరని బీజేపీకి శక్తివంతమైన సందేశం పంపాలని ఆమె పిలుపునిచ్చారు.

## జెడ్పీ ఉన్నత పాఠశాలలో
# అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి

**- చిన్నారుల భవిష్యత్ విద్యకు బలమైన పునాది వేయడమే లక్ష్యం**
**- ప్రీ-స్కూల్ విద్య, పునాది అక్షరాస్యతపై ప్రత్యేక శిక్షణ**
**- ఆటపాటల ద్వారా అభ్యసన పద్ధతులపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన**



**పెళ్లకూరు - సూర్య వాస్తవం :** నాయుడుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో భాగంగా పెళ్లకూరు మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆగస్టు 11 నుంచి 13వ తేదీ వరకు జరిగిన ఈ శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు చిన్నారుల ప్రారంభ విద్య, పునాది అభ్యసన నైపుణ్యాలు, ఆటపాటల ద్వారా బోధన వంటి అంశాలపై శిక్షణ అందించారు.

**చిన్నారుల అభ్యసన నైపుణ్యాలపై దృష్టి**

ప్రీ-స్కూల్ స్థాయిలో చిన్నారులకు వారి వయస్సు, ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా విద్యను అందించే విధానాలను శిక్షణలో వివరించారు. పిల్లలకు ఆటలు, పాటలు, కథలు, చిత్రాలు, వివిధ కార్యకలాపాల ద్వారా అభ్యసనను అందించడం వల్ల వారిలో నేర్చుకునే ఆసక్తి పెరుగుతుందని శిక్షకులు వివరించారు.భాషా వికాసం, జ్ఞాన వికాసం, సంఖ్యా పరిజ్ఞానం, సామాజిక--భావోద్వేగ అభివృద్ధి, పాఠశాల సంసిద్ధత వంటి అంశాలపై కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన కల్పించారు.

**కార్యకలాపాల ద్వారా ఆచరణాత్మక శిక్షణ**

శిక్షణలో భాగంగా కార్యకర్తలకు వివిధ విద్యా కార్యకలాపాలను స్వయంగా చేయిస్తూ వాటిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో ఎలా నిర్వహించాలనే అంశంపై ఆచరణాత్మక అవగాహన కల్పించారు. పిల్లల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, భాషా నైపుణ్యాలు, సంఖ్యా పరిజ్ఞానం పెంపొందించేలా బోధనా పద్ధతులను వివరించారు.

**శిక్షణను పరిశీలించిన సీడీపీవో**

నాయుడుపేట సీడీపీవో కె. ఉమామహేశ్వరి కీలక వనరుల వ్యక్తిగా ఈ శిక్షణా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పెళ్లకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణా తరగతులను సందర్శించి, శిక్షకులు అందిస్తున్న బోధనను పరిశీలించారు. కార్యకర్తలకు అందుతున్న శిక్షణ, నిర్వహిస్తున్న కార్యకలాపాల తీరును సమీక్షించారు. అంగన్‌వాడీ స్థాయిలోనే చిన్నారులకు విద్యపై ఆసక్తి కలిగించేలా బోధన అందించడం ఎంతో ముఖ్యమన్నారు. పిల్లల వయస్సు, ఆసక్తికి అనుగుణంగా ఆటలు, పాటలు, కథలు, వివిధ కార్యకలాపాల ద్వారా బోధిస్తే వారు సులభంగా నేర్చుకుంటారని తెలిపారు. జ్ఞానజ్యోతి శిక్షణ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రీ-స్కూల్ విద్య, పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం వంటి అంశాలపై మంచి అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. జాతీయ విద్యా విధానం--2020 లక్ష్యాలకు అనుగుణంగా చిన్నారుల్లో పునాది అభ్యసన నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ దశలో పిల్లలకు అందించే అభ్యసనం వారి భవిష్యత్ విద్యకు ఎంతో ఉపయోగపడుతుందని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆచరణలో పెట్టి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని శ్రీపతి రాజేశ్వరి పేర్కొన్నారు.

**అంగన్‌వాడీ స్థాయి నుంచే పునాది బలోపేతం**

చిన్నారుల భవిష్యత్ విద్యకు అంగన్‌వాడీ దశ ఎంతో కీలకమని సీడీపీవో కె. ఉమామహేశ్వరి పేర్కొన్నారు. ఈ దశలో పిల్లల్లో బలమైన పునాది అభ్యసన నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా వారు తదుపరి పాఠశాల విద్యను సులభంగా కొనసాగించేలా చేయవచ్చన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆచరణలో పెట్టి, చిన్నారులకు ఆనందదాయకమైన అభ్యసన వాతావరణాన్ని కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. నిపుణ్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా పిల్లల్లో పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం పెంపొందించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి హాజరైన పెళ్లకూరు మండల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షకులు వివరించిన అంశాలను ఎంతో శ్రద్ధగా, ఓపికగా ఆలకించారు. ప్రీ-స్కూల్ విద్య, పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం, ఆటల ద్వారా అభ్యసనం వంటి అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకుంటూ చురుకుగా పాల్గొన్నారు. శిక్షణలో అందించిన సూచనలు చిన్నారుల విద్యాభివృద్ధికి ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.

### ఆధునిక నేత్ర వైద్య సేవలు అందుబాటులోకి రావడం

## ఉత్తరాంధ్ర ప్రజలకు ఎంతో ప్రయోజనకరం

**- మంత్రి సత్య కుమార్ యాదవ్**





**దొరవారిసత్రం –సూర్య వాస్తవం :** ఆధునిక నేత్ర వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఉత్తరాంధ్ర ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు.ఆయన గురువారం బొబ్బిలిలో డాక్టర్,వెంగల రావు ఐ ఇన్స్టిట్యూట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ,బొబ్బిలి,ఉత్తరాంధ్ర ప్రాంతంలోని పేద ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఈ సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. దివంగత ప్రొఫెసర్ డాక్టర్ వెంకలరావు గారి సేవా ఆశయాలను ఆయన కుటుంబ సభ్యులు కొనసాగించడం స్ఫూర్తిదాయకమని అన్నారు. గత 33 సంవత్సరాలుగా బొబ్బిలి ప్రాంత ప్రజలకు సేవలందిస్తూ,ఇప్పుడు తృతీయ స్థాయి నేత్ర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం విశేషమని తెలిపారు. క్యాటరాక్ట్, గ్లాకోమా, కార్నియా, రిఫ్రాక్టివ్, విట్రియో–రెటినల్,లేజర్,ఆక్యులోప్లాస్టీ వంటి ఆధునిక నేత్ర వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఉత్తరాంధ్ర ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు.వైద్యాన్ని కేవలం వృత్తిగా కాకుండా సేవగా భావించి స్వస్థల ప్రజలకు అందుబాటులో ఉండటం అభినందనీయమని, 23 పడకలతో ప్రారంభమైన ఈ ఆసుపత్రి భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది విజయ నగరం, శ్రీకాకుళం, మన్యం, పార్వతీపురం, విశాఖపట్నం తదితర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.నేత్ర వైద్య రంగంలో విశేష సేవలందించిన డాక్టర్ టి.పి.దాస్ ని డాక్టర్,వెంగల రావు ఒరేషన్ అవార్డు తో సత్కరించడం సంతోషకరమని పేర్కొంటూ, ఈ సేవా ప్రయాణం మరింత విస్తరించి ఈ ప్రాంతంలో అంధత్వ నిర్మూలనకు దోహదపడాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆకాంక్షించారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో విద్యను బలోపేతం చేయాలి

**- "సిడిపిఓ జ్యోతి కిరణ్"**



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం :** అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహనతో కూడిన అక్షర జ్ఞానం అందించేందుకు విద్యను బలోపేతం చేయాలని సూళ్లూరుపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ జ్యోతి కిరణ్ సూచించారు.దొరవారిసత్రం మండల కేంద్రంలోని ఏకొల్లు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో "జ్ఞాన జ్యోతి"అవగాహన కార్యక్రమం మూడవరోజుగా గురువారం ముగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కార్యకర్త మెరుగైన విద్య,పోషణ,సంరక్షణతో పాటు,21 వైకల్యాలను గుర్తించి వారికి అవసరమైన సహాయక చర్యలకు సహకరించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అంకమ్మ, ఎంఈఓ,హై స్కూల్ హెచ్ఎం,ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగ మేళాకు విశేష స్పందన

**- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం: ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ**



**నాయుడుపేట – సూర్య వాస్తవం:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధితో పాటు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. సూళ్లూరుపేట పట్టణంలోని ఎస్‌వీఎస్ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత తమ కెరీర్ అభివృద్ధికి ఉద్యోగ మేళాలను తొలి అడుగుగా భావించి, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాల కోసం యువత ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రముఖ కంపెనీలను నియోజకవర్గానికే తీసుకువచ్చి స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో యువతకు నైపుణ్యాభివృద్ధితో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉద్యోగ మేళాలో మొత్తం 15 ప్రముఖ కంపెనీలు పాల్గొనగా, ఉద్యోగాల కోసం 209 మంది యువతీ యువకులు హాజరయ్యారు. వివిధ దశల్లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియ అనంతరం 86 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ, ఇతర అతిథులు కలిసి ఆఫర్ లెటర్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ మేళాలో పాల్గొన్న కంపెనీల మానవ వనరుల ప్రతినిధులతో ఎమ్మెల్యే చర్చించి, హాజరైన అభ్యర్థులకు సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉద్యోగ మేళా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా 2026 అక్టోబర్ 22న కనీసం 30 కంపెనీలతో మరో భారీ ఉద్యోగ మేళా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. యువత నైపుణ్యం, ఉపాధి, ఉజ్వల భవిష్యత్తే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్కిల్ ఇండియా పోటీల్లో జాతీయ స్థాయిలో ఫ్లోరిస్ట్రీ విభాగంలో కాంస్య పతకం సాధించిన ఎస్‌వీఎస్ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని కుమారి హనీ గ్రేస్‌ను ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ ఘనంగా సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# "గడపగడపకూ టీడీపీ.. రెండేళ్ల పాలనపై ప్రజల్లోకి నేతలు"

**- అభివృద్ధి--సంక్షేమ పథకాలపై ఇంటింటా అవగాహన..**
**కూటమికి ప్రజల మద్దతు కోరిన నాయకులు**
**- కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన**
**- ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని తెలుసుకున్న టీడీపీ నాయకులు**



**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి అందుతున్న ప్రయోజనాలను తెలుసుకునే లక్ష్యంతో పెళ్లకూరు మండల కేంద్రంలో "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఐకటి చైర్మన్ పేరం రమేష్ నాయుడు ఆదేశాలతో, ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు కన్నలి వాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. మండల కేంద్రంలోని ప్రతి ఇంటికీ స్థానిక టీడీపీ నాయకులు, మండల నాయకులు కలిసి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా రూపొందించిన "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కరపత్రాలను ప్రతి కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆ కుటుంబంలో ఎంతమంది లబ్ధి పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు తమ సహకారం అందించాలని కోరారు. ప్రతి కుటుంబంతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను, ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను తెలుసుకోవడం ద్వారా "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం ప్రజలతో పార్టీకి మరింత సన్నిహిత సంబంధాలను ఏర్పరచేలా సాగిందని నాయకులు తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.



**కేక్ కట్ చేసి సంబరాలు**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరిస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలిచి, తమ మద్దతును కొనసాగించాలని టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న కూటమికి ప్రజలు మరోసారి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య, టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, వేలూరు మురళీకృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చైతన్య కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ సిద్దులయ్య నాయుడు, పేరం మధు నాయుడు, కన్నలి వాసు, పునబాక పోలయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి, కందముడి శివకుమార్, హరి నాయుడు, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్

**- మహిళలు,చిన్నారుల భద్రతపై అవగాహన కార్యక్రమాలు.**
**- పోక్సో చట్టం,బాల్య వివాహాల నిరోధం, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన.**
**- రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై అవగాహన.**
**- గంజాయి,మాదక ద్రవ్యాల వినియోగం మరియు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై అప్రమత్తత.**
**- విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహన తనిఖీలు, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు.**
**- సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యతపై ప్రజలకు సూచనలు**



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్.ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు చేపట్టారు.వెంకటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాలపేటలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మహిళలు,చిన్నారులపై జరిగే నేరాలు,పోక్సో చట్టం,బాల్య వివాహాల నిరోధం, సైబర్ నేరాలు,సైబర్ బుల్లీయింగ్,హెల్మెట్ వినియోగం,పగలు మరియు రాత్రి వేళల్లో భద్రతా చర్యలు,చైన్ స్నాచింగ్ నివారణ,సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.బీఎన్ కండ్రిగ పట్టణంలో సీఐ బీఎన్ కండ్రిగ,ఎస్ఐతో కలిసి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రజలకు పోలీసుల భద్రతా చర్యలపై అవగాహన కల్పిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం పర్యవేక్షణ చేపట్టారు. బాలాయపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పిగిలాం కొత్తపాలెం గ్రామంలో ఎస్ఐ మరియు సిబ్బంది గ్రామస్థులతో మాట్లాడి డ్రంక్ అండ్ డ్రైవ్,హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు,గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల సంచారం,గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. నాయుడుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అమరావతి సెంటర్‌లో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనదారులు,మహిళలకు రోడ్డు భద్రత, హెల్మెట్ ధరించడం,సైబర్ నేరాల నివారణ,మాదక ద్రవ్యాలు మరియు గంజాయి దుష్ప్రభావాలు, మహిళల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అదేవిధంగా బీఎన్ కండ్రిగ పట్టణంలో ఎస్ఐతో కలిసి వాహన తనిఖీలు నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించారు. సుళ్లూరుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని షేర్ వై జంక్షన్ వద్ద కూడా విజిబుల్ పోలీసింగ్‌తో పాటు వాహన తనిఖీలు నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు .ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని,ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పద వ్యక్తులు,కార్యకలాపాలు లేదా మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని,మహిళలు మరియు చిన్నారుల భద్రత విషయంలో తల్లిదండ్రులు,విద్యాసంస్థలు,ప్రజలు సమిష్టిగా బాధ్యత వహించాలని సూచించారు.

